ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్టం : 33.0 కనిష్టం : 25.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 17 జూన్ 2025

వరుస వానల దెబ్బ



కుళ్లిపోతున్న పత్తి

నీట మునిగి వేరుశనగకూ నష్టం



6

అన్నదాతా సుఖీభవపై కసరత్తు..!

- రేపటిలోగా రైతుల ఈకేవైసీ పూర్తికి ఆదేశం
- జిల్లాలో 2,70,477 మంది అర్హులుగా గుర్తింపు
- ఇప్పటిదాకా 2,62,711 మందికి ఈకేవైసీ



6

● మెయిన్‌లో

సెవెన్ హిల్స్‌కు తప్పిన ప్రమాదం

బ్రేక్ బైండింగ్‌తో చెలరేగిన మంటలు



ధర్మవరం మండలం చిగిచెర్ల వద్ద ఆగిన రైలు

ఇట్లుంటాది.. పెద్దాస్పత్రిలో..!




బాధిత డాక్టర్‌ను చూస్తున్న తోటి డాక్టర్లు

డాక్టర్ అయినా సరే.. పేషెంట్‌గా మారితే వైద్యం కోసం నిరీక్షించాల్సిందే..! ప్రభుత్వ వైద్యశాలలలో సేవలంటే అట్లనే ఉంటాయి..! ఈ అనుభవం జిల్లా సర్వజన వైద్యశాలలో ఒక జూనియర్ డాక్టర్‌కు సోమవారం ఎదురైంది. ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ (ఈఓటీ) వద్ద ఒక జూనియర్ డాక్టర్ కాలుజారి పడ్డారు. థియేటర్‌లోని వచ్చే సమయంలో.. బండలపై రసం పడి ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కింద పడ్డ ఆమెను వీల్‌చైర్‌లో అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. తోటి జూనియర్ డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు ఏమైందంటూ బాధిత జూడాను చుట్టుముట్టారు. అప్పటికే బెడ్లు నిండిపోయి, రోగులతో కిక్కిరిసి ఉడంటంతో ఆమె వీల్ ఛైర్‌మీదే గడపాల్సి వచ్చింది. ఆమె నడవలేని పరిస్థితిలో ఉన్నా.. డాక్టరని తెలిసినా.. ఎంఎన్‌ఓ ఏమాత్రం కనికరించలేదు. 'మీరు దిగితే వీల్ ఛైర్ తీసుకుపోతా..' అని ఆత్రపెట్టాడు. చేసేది లేక బాధితురాలు వీల్‌ఛైర్ నుంచి దిగాల్సి వచ్చింది. ఈ లోగా మరో జూనియర్ డాక్టర్ ఓపీ చీటీ తీసుకువచ్చారు. బాధితురాలిని స్కానింగ్‌కు తీసుకువెళదామంటే వీల్ ఛైర్ లేదు. ఎలాగోలా వీల్ ఛైర్‌ను దొరకబుచ్చుకున్నా.. తోసేవారులేరు. అలా తంటాల నడుమ స్కానింగ్ పూర్తి అయ్యేసరికి సాయంత్రం నాలుగు గంటలైంది. బాధిత డాక్టర్‌కు కుడికాలు పాదంపై ఎముక చిట్లినట్లు స్కానింగ్‌లో గుర్తించారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్ డాక్టర్ బ్యాండేజ్ కట్టేసరికి మరో గంట అయింది. 'ఇంక చాలు.. విజయవాడకు వెళ్లి చూపించుకుంటా..' అని బాధితురాలు నిట్టూర్చారు. ఎంత ప్రభుత్వ ఆస్పత్రి అయితే మాత్రం.. ఓ డాక్టరుకు సరైన వైద్యం అందకపోతే ఎలా..? కనీసం వీల్ ఛైర్‌లో కూర్చోనివ్వకపోతే ఎలా..? ఇలా అయితే సామాన్యుల పరిస్థితి ఏమిటి..? కొంతైనా మానవత్వం.. బాధ్యత ఉండొద్దూ..? - ఆంధ్రజ్యోతి, అనంతపురం వైద్యం

బదిలీపై వెళ్తే.. పోస్టే లేదు





విద్యాశాఖలో మాయాజాలం..

బదిలీ టీచర్లకు షాక్

- కొత్త స్కూల్‌లో ఖాళీ లేదంట..!
- డీఈఓ ఆఫీసుకు పరుగులు
- పొరబాటా.. ఉద్దేశపూర్వకమా..?

● చెన్నేకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న విజయనిర్మల తప్పనిసరి బదిలీ కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. బత్తలపల్లి స్కూల్‌ను కోరుకున్నారు. అక్కడ పోస్టు లేదన్నారు. ఆ తర్వాత అదే మండలంలోని ఈదులముష్టూరు పాఠశాలను ఎంచుకున్నారు. కౌన్సెలింగ్‌లో ఆ స్థానం ఖరారైంది. తీరా పాఠశాలకెళ్తే పోస్టు ఖాళీ లేదని వెనక్కు పంపించారు. దీంతో డీఈఓ ఆఫీసుకు పరుగులు తీసుకుంటూ వచ్చారు.

అనంతపురం విద్య, జూన్16(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఎంచుకున్న పాఠశాలలకు టీచర్లు ఆనందంగా వెళ్లారు. జాయినింగ్ అవుదామంటే కొత్త స్కూల్‌లో పెద్ద షాక్ ఇచ్చారు. ఆ స్కూల్‌లో సంబంధిత పోస్టు ఖాళీ లేదని చెప్పడంతో అవాక్కయ్యారు. బదిలీల్లో ఖాళీ చూపి, ఆప్షన్ తీసుకుని, కౌన్సెలింగ్‌లో కేటాయించిన పోస్టు లేకపోవడం ఏంటని ఉపాధ్యాయ వర్గాలు ఇస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇంత పకడ్బందీగా బదిలీలు నిర్వహించినా.. పోస్టులే లేకపోవడం ఏంటని అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇది విద్యాశాఖ మాయాజాలం అని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. కొందరు అక్రమాలకు తెరలేపి, తమ వారికి కోరుకున్న ప్లేస్ దక్కేలా చేసేందుకు ఈ కనికట్టు ప్రదర్శించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త స్కూల్‌లో పోస్టు ఖాళీ లేకపోవడంతో బదిలీ అయిన టీచర్లు గాలిలో ఉన్నారు. విద్యాశాఖాధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొరబాటా.. ఉద్దేశపూర్వకమా..?

టీచర్ల ప్లేస్‌ల మాయాజాలంపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖలో పనిచేస్తున్న కొందరు కుమ్మక్కై ఇలా అక్రమాలకు పాల్పడి తమ వారికి కోరుకున్న ప్లేస్ ఇప్పించారన్న ఆరోపణలు వస్తున్నాయి. డీఈఓ బదిలీల ప్రక్రియ కోసం కొందరిని డెప్యుటేషన్‌పై నియమించుకున్నారు. వారిలో ఒకరిద్దరు ఇలాంటి వ్యవహారాలు నడిపారన్న ప్రచారం జరుగుతోంది. ఖాళీలు ప్రకటించేటపుడు ఎస్‌ఏ పోస్టులను ఆ ఉన్నత పాఠశాల హెచ్ఎం, డిప్యూటీ డీఈఓలు, ఎస్జీటీలకు సంబంధించి ఎంఈఓలు చూపిస్తారు. ఆ తర్వాత కూడా రాష్ట్రశాఖ పదేపదే..

(మిగతా 6లో..)

లలిత జ్యువెలర్..!



సీఐ సమక్షంలో అనుదీప్‌కు నెక్లెస్ ఇస్తున్న లలిత

బంగారం ధర భగభగ మంటోంది. ఇలాంటి సమయంలో ఎవరూ లేనిచోట ఓ ఐదు తులాల బంగారం దొరికితే..! భలే చాన్స్ కదా..? కానీ అలా అనుకోకుండా.. దొరికిన బంగారాన్ని పోగొట్టుకున్నవారికి చేర్చారు లలిత. అనంతపురం కోర్టు రోడ్డులోని ఐటీ మిట్ట మీద వెళుతుండగా.. నల్లపరెడ్డి కాలనీకి చెందిన లలితకు రోడ్డుపై ఓ బ్యాగ్ కనిపించింది. తెరిచి చూస్తే అందులో బంగారు నెక్లెస్ కనిపించింది. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో నేరుగా టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నెక్లెస్‌ను అప్పగించారు లలిత. విచారించిన పోలీసులు.. బంగారాన్ని పోగొట్టుకున్నవారిని గుర్తించారు. కృపానంద నగర్‌కు చెందిన చల్లా అనుదీప్, ఆయన కుటుంబ సభ్యులు 3వ రోడ్డులోని ఓ మఠానికి వెళ్లి వస్తూ బ్యాగ్‌ను జారవిడుచుకున్నారు. వారిని స్టేషన్‌కు పిలిపించిన సీఐ శ్రీకాంత్.. లలిత చేతులమీదుగానే నెక్లెస్‌ను అప్పగించారు. నిజాయతీగా వ్యవహరించిన లలితను ప్రత్యేకంగా అభినందించారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

సుంకంపై బింకం..!

మార్కెట్ యార్డులో కాంట్రాక్టర్ల దందా





మార్కెట్ యార్డులో వాహనాలకు ఇచ్చిన రసీదు, వసూలు చేస్తున్న వ్యక్తి

అనంతపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మున్సిపల్ కాంట్రాక్టర్ల హవా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్‌యార్డులోకి వచ్చివెళ్లే వాహనాల నుంచి సుంకం వసూలు చేస్తున్నారు. కాంట్రాక్టు మేరకు వీరు మున్సిపాల్టీ పరిధిలోకి వచ్చి వెళ్లే వాహనాల నుంచి మాత్రమే సుంకం వసూలు చేసుకోవాలి. కానీ మార్కెట్ యార్డులోకి కూడా చొరబడిపోయారు. దర్జాగా యార్డులోకి వచ్చే వాహనాల నుంచి రూ.100చొప్పున సుంకం వసూలు చేస్తున్నారు. ఇక్కడే కాదు.. పశువుల సంతలోనూ ఇదే విధంగా సుంకం వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం యార్డులోకి మున్సిపాల్టీ కాంట్రాక్టర్లు వచ్చి సుంకం వసూలు చేసే వీలులేదని సంబంధిత వర్గాల సమాచారం. అయితే కాంట్రాక్టర్లు అధికార పార్టీ నేతల పేర్లు చెప్పి యార్డులోకి చొరబడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ అధికారులు రాజకీయ నాయకులతో మనకెందుకు కులే అనుకుని అడ్డు చెప్పలేని పరిస్థితి నెలకొంది. నిత్యం పదుల సంఖ్య లో వాహనాలు యార్డులో చీనీ మార్కెట్‌కు ఇతరత్రవాటికి వస్తుంటాయి. దీనికితోడు పశువుల సంతకు వచ్చే వాహనాల సంఖ్య ఇందు కు రెట్టింపులోనే ఉంటుంది. యార్డు అధికారులు సుంకం వసూలుకు వేలం నిర్వహించినా రూ.లక్షల్లో ఆదాయం సమకూరే వీలుంది. ఆదిశగా సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడం గమనార్హం.

● మున్సిపాల్టీ కాంట్రాక్టర్లు మార్కెట్‌లోకి వచ్చి సుంకం వసూలుపై యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందును వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈనే పథ్యంలోనే యా ర్డులో వసూలు చేయొద్దని చెప్పినట్లు తెలిపారు. యార్డు బయట సుంకం వసూలు చేసుకోవాలిగానీ యార్డులోకి రాకూడదని చెప్పినట్లు వెల్లడించారు.



వజ్రకరూరు ఆర్‌ఎస్‌కే వద్ద వేచివున్న రైతులు

రైతుల పడిగాపులు..!

ఉరవకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకునేందుకు అన్నదాతలు రోజంతా పడిగాపులు కాయాల్సి వచ్చింది. అన్నదాతా సుఖీభవ పథకం డబ్బు ఖాతాల్లోకి జమచేయనున్న నేపథ్యంలో ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచించారు. దీంతో వజ్రకరూరుతోపాటు మండలంలోని గూళ్యపాల్యం, గంజికుంట రైతు సేవాకేంద్రాల (ఆర్‌ఎస్‌కే) వద్దకు ఉదయాన్నే పెద్ద సంఖ్యలో వచ్చారు. సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి పడిగాపులు కాశారు. గంజికుంట ఆర్‌ఎస్‌కేకి గంజికుంట, తట్రగల్లు, ఎన్ఎన్‌పీ తండాకు చెందిన రైతులు తరలివచ్చారు. రైతులు ఎక్కువగా రావడంతో ఆర్‌ఎస్‌కేలో గందరగోళం ఏర్పడింది. గంటల తరబడి వేచిచూసినా సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగిపోయారు.

విచ్చలవిడిగా మట్కా.. పేకాట..!

● నామమాత్రంగా దాడులు ● నిద్రావస్థలో పోలీసుశాఖ

● బహిరంగంగానే చీటీలు రాస్తున్న బీటర్లు (వివరాలు 7వ పేజీలో..)

ప్రతి గడపలో ఆనందం

- 'తల్లికి వందనం'పై వైసీపీ దిగజారుడు వ్యాఖ్యలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, ఎంపీ అంబికా



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి గడపలో 'తల్లికి వందనం' ఆనందం కనిపిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మంత్రి నారా లోకేష్ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి నిరూపించారని అన్నారు. వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్ మొహిద్దీన్‌తో కలసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సూపర్ సిక్స్ అమల్లో భాగంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తల్లికివందనం అమలు చేయడంతో వైసీపీ నేతల మైండ్ బ్లాంక్ అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో 42 లక్షల మందికి ఇస్తే.... కూటమి ప్రభుత్వంలో 67.27 లక్షల మందికి తల్లికివందనం వచ్చిందని గుర్తుచేశారు. లక్షలాది మంది తల్లుల మోముల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. విద్యార్థులకు రూ. 13 వేలు ఇచ్చారని, రూ. 2 వేలు లోకేష్ జేబులోకి పోయాయంటూ వైసీపీ నేతలు కొత్త డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. లోకేష్ 24 గంటల టైం ఇచ్చినా ఏ ఒక్క నాయకుడూ ఆరోపణలు నిరూపించలేక పోయారన్నారు. ప్రజలు ఓటుతో దెబ్బకొట్టినా.... సైకో బ్యాచ్‌కు బుద్ధి రాలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

లేనిది ఉన్నట్లు..!

ఆన్‌లైన్‌లో ఎకరాలకు ఎకరాల భూమి

● అధికారుల నిర్లక్ష్యంతో అందని తల్లికి వందనం ● సచివాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ



తాడిమర్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చదువులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరిట అద్భుతమైన పథకాన్ని అమలు చేస్తోంది. ఒక్కొక్కరి రూ.13 వేలు చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ లబ్ధి చేకూరుస్తోంది. వారి తల్లి ఖాతాలో సొమ్ము జమ చేస్తోంది. ఇటీవలే ఆ పథకం అమలులోకి వచ్చింది. అర్హత ఉండి.. సొమ్ము పడకపోతే వెంటనే దరఖాస్తులు సమర్పించాలని, అందరికీ సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం సూచించింది. దీంతో సొమ్ము జమకానివారు సచివాలయాలకు వెళ్లి కారణాలు తెలుసుకుంటున్నారు. అనర్హుల జాబితాలో ఉన్న అర్హులు.. తమకు సొమ్ము పడకపోవడానికి అధికారులు చేసిన పొరపాట్లే కారణమని తెలుసుకుని ఆవేదన చెందుతున్నారు. భూమి లేకపోయినా, కాస్త భూమి ఉన్నా.. 10 ఎకరాలకు పైగా మెట్ట భూమి ఉన్నట్లు చూపించి.. 'తల్లికి వందనం' అందకుండా చేశారు. అనర్హుల జాబితాలో మెజార్టీ పేదలు ఇదే కారణంలో నష్టపోయారు.

నేటి నుంచి గ్రీవెన్స్

తల్లికి వందనం అందని అర్హుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, న్యాయం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఫిర్యాదుల స్వీకరణ ప్రభుత్వం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో అర్హులైన తల్లిదండ్రులు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. సమస్య ఏమిటో గుర్తించి, పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. రాబోవు మూడు రోజుల పాటు బాధితులకు అందుబాటులోట ఉండి.. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఇస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. లేదంటే ఈ ఏడాది అందాల్సిన సొమ్ము వారికి దూరమౌతుంది.

లేని భూమి ఉన్నట్లు..

తాడిమర్రి మండలంలో 'తల్లికి వందనం' పథకానికి 4,239 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,435 మందికి సంబంధించి రూ.4,46,55,000 వారి వారి తల్లుల ఖాతాలో జమ అయింది. మరో 884 మందికి పథకం అమలు కావాల్సి ఉంది. తాడిమర్రి పంచాయతీలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 477 మంది దరఖాస్తు చేసుకోగా 338 మందికి

(మిగతా 6వ పేజీలో...)

ఆస్తి కోసమే అపహరణ

- మారుతమ్మను ఎత్తుకుపోయిన తల్లిదండ్రులు
- మరిదిని పెళ్లి చేసుకోవాలని చిత్రహింసలు
- కేసును ఛేదించిన పోలీసులు.. 11 మంది అరెస్టు



ఆమె కష్టపడి ఉద్యోగం సాధించింది. బాధ్యతగా కుటుంబాన్ని చూసుకుంటోంది. ఆమెకు పెళ్లి చేస్తే.. ఆస్తి పోతుందని, తమకు జీవనాధారం ఉండదని భావించారు తల్లిదండ్రులు, తోబుట్టువులు. చెల్లెలి మొగుడికి ఇచ్చి పెళ్లి చేస్తే తమతోనే ఉంటుందని వికృత ఆలోచన చేశారు. ఇష్టపడినవాడిని పెళ్లి చేసుకున్నందుకు కక్ష పెంచుకుని, అపహరించి చంపే ప్రయత్నం చేశారు. ఈ కుట్ర చేసిన 11 మందిని పోలీసులు పట్టుకుని జైలు గోడల మధ్యకు పంపించారు. (వివరాలు 7లో)

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

జూమ్‌లో పోలీసులకు ఎస్పీ జగదీష్ ఆదేశం



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలపై పోలీసులు తక్షణం స్పందించాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఆయన పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. భర్త, అత్తింటి వేధింపులు, భూ, ఆస్తి తగాదాలు, రస్తా గొడవలు, కుటుంబ కలహాలు తదితర అంశాలపై బాధితుల నుంచి 97 పిటీషన్లు వచ్చాయి. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. తర్వాత ఎస్పీ జగదీష్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీసులతో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిశీలించాలని, విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా విభాగం డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.4.33 లక్షల చెక్కు అందజేత..

ఉద్యోగ విరమణ పొందిన మహిళా హోంగార్డ్ కృష్ణవేణికి డీపీఓలోని తన చాంబర్‌లో ఎస్పీ జగదీష్ రూ. 4.33 లక్షల చెక్కు అందించారు. జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు వేతనం మొత్తాన్ని సేకరించిన రూ. 4,33,200కు సంబంధించిన చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆర్ఐలు పవన్‌కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

33 మందికి రూ.45.50 లక్షల లబ్ధి

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత
- 'తల్లికి వందనం'తో ఇంటింటా ఆనందం
- అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ కింద 33 మంది బాధితులకు రూ. 45.50 లక్షల ప్రయోజకం కలిగిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 33 మందికి రూ. 45.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా బాధితులను సీఎం చంద్రబాబు ఆదుకుంటున్నారని గుర్తుచేశారు. తల్లికివందనం పథకం వల్ల ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. గతంలో ఒక్కరికే అందేదని, ఇప్పుడు ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే...అందరికీ అందుతోందని అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని అక్టోబర్ 2 నాటికి పరిశుభ్రంగా చేస్తామని, త్వరలో నడిమి వంక ప్రొటెక్షన్ వాల్ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

త్వరలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్‌ను ప్రారంభిస్తామన్నారు. జాబ్‌మేళా ద్వారా రెండు రోజుల కిందట 1450 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరుస వానల దెబ్బ

కుళ్లిపోతున్న పత్తి

నీట మునిగి వేరుశనగకూ నష్టం

ఆవేదనలో అన్నదాతలు



ఎర్రగా మారి కుళ్లిపోతున్న పత్తి పంట

బొమ్మనహాళ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వరుస వానలు పత్తి, వేరుశనగ పంటలను దెబ్బతీశాయి. గత వారంలో మండలంలో మూడురోజులుగా కురిసిన వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి కాయలు చేనులోనే తడిసి, నల్లబడుతోంది. వేరుశనగ నీట మునిగి చెట్టు కుళ్లిపోతోంది. గోవిందవాడ గ్రామ శివారు ఇసుక పొలాల్లో బోర్ల కింద వేరుశనగ సాగు చేసి, నెల రోజులైంది. వర్షం వచ్చి నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. 70 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఉద్దేహాళ్, ఉప్పరహాళ్, లింగదహాళ్, రంగాపురం క్యాంప్ తదితర గ్రామాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కాయలోకి నీరు చేరి కుళ్లిపోతున్నాయని తెలిపారు. పత్తి మొక్కలు ఎర్రగా మారి వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. తీరా కోతకు సిద్ధమైన సమయంలో పంట ఇలా వర్షానికి దెబ్బ తినడం అన్నదాతకు తీవ్ర నష్టం మిగులుస్తోంది.

రెండెకరాల్లో పత్తికి నష్టం: శివరాజ్, ఉప్పరహాళ్



రబీలో బోరుబావి కింద రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టా. పంట చేతికొచ్చిన సమయంలో వర్షం కురిసి నష్టాన్ని మిగిల్చింది. పెట్టుబడులు కూడా దక్కవు. ఖరీఫ్ సాగుకు అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

అప్పులు తీరుతాయనుకుంటే..! మేటి సోమ, గోవిందవాడ



ఇసుక పొలంలో నాలుగెకరాల్లో వేరుశనగ పంటను నెల రోజులు క్రితం సాగు చేశా. పంట బాగా వచ్చింది. ఈసారి పంట పండితే అప్పులు తీరుతాయనుకున్నా. అంతలోని వరుస వానలకు పంట మొత్తం నీట మునిగి రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లింది.

వీలైనంత త్వరగా నీటిని తొలగించాలి



అధిక వర్షాలు కురవడంతో పత్తిపంట వాడుముఖం పడుతోంది. పత్తి పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వీలైనంత త్వరగా తీసేయాలి. యూరియా, పొటాష్ తదితరాలను వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచన మేరకు తగిన మోతాదులో వేసుకోవాలి.

-సాయికుమార్, మండల వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

బదిలీపై వెళ్తే పోస్టే లేదు..!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి పక్కా ఖాళీలను చూపించాలని ఆదేశించింది. అపుడు కూడా డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలను జిల్లాకేంద్రానికి పిలిపించుకుని, వెరిఫై చేయించారు. ఆ తరువాతే ఖాళీలను రాష్ట్ర శాఖకు పంపగా.. అపుడు ప్రకటించారు. అలాంటపుడు ఖాళీలు ఎక్కడికెళ్లాయనేది అర్థంకాని ప్రశ్న. డీఈఓ ఆఫీసులో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇద్దరు పక్కా ప్రణాళికతోనే ఇలాంటి అవకతవకలకు పాల్పడ్డారనే అనుమానాలు బలపడుతున్నాయి. ఏదిఏమైనా విద్యాశాఖ మాయాజాలంలో బదిలీల్లో కోరుకున్న పాఠశాలలో పోస్టులు లేక ఆయా టీచర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- బొమ్మనహాళ్ మండలం శ్రీధరగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న రంగేనాయక్ బదిలీల్లో మడకశిర మండలం కెంకర ఎంపీయూపీఎస్‌కు ఆప్షన్ పెట్టుకున్నారు. ఆ ప్లేస్ కేటాయించారు. జాయిన్ అవడానికి అక్కడికెళ్తే పోస్టు ఖాళీలేదని ఎంఈఓ చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారు.
- రాప్తాడు మండలం గంగులకుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీచర్ ఓబులేసు బదిలీకి దరఖాస్తు చేసుకుని, ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన మాన్యువల్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. బెళుగుప్ప మండలం రామసాగరం పాఠశాలను కోరుకున్నారు. బదిలీ ఆర్డర్ మాత్రం అదే మండలంలోని శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలకు ఇచ్చారు. అక్కడికెళ్తే పోస్టు ఖాళీలేదంటూ పెద్ద షాక్ ఇచ్చారు.
- రాధాక్రిష్ణ అనే టీచర్‌ది వింత బాధ. ఈయన పెద్దవడుగూరు మండలం రామరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్నారు. తప్పనిసరి బదిలీ కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరై గుత్తి మండలం మాముడూరు కోరుకున్నారు. ఆప్షన్ ఫాంలో సంతకం కూడా పెట్టి వెళ్లారు. అక్కడ ప్లేస్‌లు చూపిస్తున్న ఆఫీస్ టెక్నీషియన్ దానిని ఫ్రీజ్ చేయకుండా వదిలేశారు. దీంతో మరుసటిరోజు కొనసాగిన కౌన్సెలింగ్‌లో ఆయనకన్నా వెనుక ఉన్న, శెట్టూరు మండలంలో పనిచేస్తున్న వరలక్ష్మి హాజరుకాగా, ఆమె గుత్తి మండలంలో చూపాలని కోరారు. అపుడు మాముడూరు ఖాళీ కనిపించడంతో కోరుకున్నారు. ఆమెకు కేటాయిస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. అంతకన్నా ముందుగా కోరుకున్న రాధాక్రిష్ణకు బదిలీ ఉత్తర్వులు రాక ఎనిమిదేళ్లు పూర్తయినా ఇపుడు గాల్లో ఉండాల్సి వచ్చింది. న్యాయం చేయాలని ఆయన.. విద్యాశాఖ అధికారులను కలిసి కోరారు. ఇవికి మచ్చుకు కొన్ని మాత్రమేనని ఉపాధ్యాయవర్గాలు అంటున్నాయి. ఇలాంటి బాధితులు ప్రతి కేడర్‌లో పదుల సంఖ్యలో ఉన్నారని చర్చించుకుంటున్నారు.

పొరబాట్లను సరిదిద్దుతాం: ప్రసాద్‌బాబు, డీఈఓ

బదిలీల్లో పోస్టులు చూపించడంలో కొన్నిపొరబాట్లు జరిగాయి. మరికొన్ని సాంకేతిక సమస్యలతో ఉత్పన్నమయ్యాయి. కోరుకున్న ప్లేస్‌లు లేవని కొందరు టీచర్లు వస్తున్నారు. వారి వినతులు తీసుకుని, పొరబాటు ఎక్కడ జరిగిందో పరిశీలిస్తున్నాం. సమస్యను పరిష్కరించి, అందరికీ ప్లేస్‌లు ఇస్తాం. సిబ్బంది ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసి ఉండుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

నేడు నోటు పుస్తకాల పంపిణీ

అనంతపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల పిల్లలకు మంగళవారం ఉదయం ఉచిత నోటుపుస్తకాల పంపిణీ చేస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు సోమవారం తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించామని, దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే నోటుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



జంబులదిన్నె చెరువులో ఏపుగా పెరిగిన కంపచెట్లు

అడవుల్లా చెరువులు..!

- ఐదేళ్లలో మరమ్మతులు శూన్యం
- ఆయకట్టుకు అందని నీరు

గ్రామానికి వెళ్లేందుకు భయపడుతున్నాం



గార్లదిన్నె నుంచి జంబులదిన్నెకు పోవాలంటే చెరువులోని మట్టిరోడ్డు మీదుగా వెళ్లాలి. చెరువులో చెట్లు అధికంగా పెరగడంతో రాత్రి సమయంలో గ్రామానికి పోవాలంటే భయంగా ఉంటుంది. రోడ్డు కూడా గుంతలమయమైంది. చెరువులోని చెట్లను తొలగించడంతో పాటు రోడ్డు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

-పుల్లన్న, జంబులదిన్నె

గార్లదిన్నె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులు మరమ్మతుకు నోచుకోలేదు. ఫలితంగా చెరువుల్లో కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో జంబులదిన్నె, యర్రగుంట్ల, తిమ్మంపేట, పాపిణిపాళ్యం, కోటంక, మర్తాడు తదితర చెరువుల్లో కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో చెరువులకు నీరు సక్రమంగా పారడం లేదు. చెరువులు అడవులను తలపిస్తుండడంతో వివిధ జంతువులు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా జంబులదిన్నె గ్రామస్థులు ప్రతిరోజూ గార్లదిన్నెకు రావాల్సి ఉంటుంది. జంబులదిన్నె నుంచి గార్లదిన్నెకు రావడానికి చెరువు మధ్య ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు మీదనే ప్రయాణం చేయాలి.

గ్రామానికి ఎలాంటి బస్సులు, ఆటోలు లేవు. దీంతో జంబులదిన్నె గ్రామస్థులు ద్విచక్ర వాహనాలు, నడుచుకుంటూ వెళుతుంటారు. రాత్రి సమయంలో ఆ రోడ్డు మీద వెళ్లేందుకు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరగడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కాక చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ పాలనలో చెరువులకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేస్తే ఆయకట్టు రైతులతో పాటు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.



గుంతలమయమైన జంబులదిన్నె రోడ్డు

చెరువుకు మరమ్మతులు చేయిస్తాం



2014లో తెలుగుదేశం హయాంలో జంబులదిన్నె చెరువుకు సుమారు రూ.25 లక్షలతో మరమ్మతులు చేయించాం. వైసీపీ హయాంలో చెరువుకు ఎలాంటి నిధులు రాలేదు. ఫలితంగా చెరువులో పెద్దఎత్తున చెట్లు పెరిగాయి. మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే చెట్లను తొలగించడంతో పాటు తూములకు మరమ్మతులు చేయించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చేస్తాం.

- రాంభూపాల్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు, జంబులదిన్నె

మత్స్యకారులు నష్టపోతున్నారు..



చెరువులో కంపచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో చెరువులో చేపపిల్లలు అభివృద్ధి కాలేదు. జంబులదిన్నె చెరువు ద్వారా 42 మంది పైగా మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నాం. చేపలు పట్టుకునే సమయంలో వలలు చెట్లకు తగులుకుని తెగిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. చెరువులో పెరిగిన కంపచెట్లు, తుమ్మచెట్లు తొలగిస్తే మత్స్యకారులతో పాటు ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది.

- నాగప్ప, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, జంబులదిన్నె

అన్నదాతా సుఖీభవపై కసరత్తు..!

- రేపటిలోగా రైతుల ఈకేవైసీ పూర్తికి ఆదేశం
- 2,70,477 మంది రైతులు అర్హులుగా గుర్తింపు
- ఇప్పటి దాకా 2,62,711 మందికి ఈకేవైసీ

అనంతపురం అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 20 లేదా 21వతేదీ అన్నదాతా సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది రైతులతో ఈకేవైసీ చేయించడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 2,70,477 రైతులు అన్నదాతా సుఖీభవకు అర్హులుగా గుర్తించారు. ఆ మేరకు రైతు సేవా కేంద్రాలకు జాబితా వెళ్లింది. అందులో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులతో నమోదు చేయిస్తున్నారు. గత నెల మొదటి వారంలో వెబ్ ల్యాండ్ ఆధారంగా అర్హులైన రైతుల జాబితాను తయారుచేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 2,62,711 మంది రైతులకు సంబంధించి ఈకేవైసీ పూర్తయింది. ఇందులో కొందరు రైతులతో ఆర్ఎస్‌కే సిబ్బంది ఈకేవైసీ వేయించుకోగా.. మరికొందరు రైతులకు సంబంధించి గతంలో ఈ క్రాపింగ్, ఇతర ఈకేవైసీల ఆధారంగా ఆటోమేటిక్‌గా ఆన్‌లైన్‌లో ఈకేవైసీ పూర్తయింది. జిల్లాలో ఇంకా 7,766 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. పెండింగ్‌లోని రైతులతో మాత్రమే ఈనెల 18వతేదీలోగా ఈకేవైసీ వేయించుకోవాలని సోమవారం కమిషనరేట్ నుంచి వ్యవసాయ అధికారులకు సమాచారం అందింది. గత ప్రభుత్వం హయాంలో ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో, కేంద్రం మూడు విడతల్లో జమ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.7500, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6000 జమ చేస్తూ వచ్చారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుతం సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నదాతా సుఖీభవ కింద ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా అన్నదాత సుఖీభవ సొమ్మును జమ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

'అన్నదాతా సుఖీభవ'కు ప్రత్యేకంగా అవసరం లేదు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

యాడికి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. సోమవారం యాడికిలోని రైతుసేవాకేంద్రంలో ఈకేవైసీ నమోదును ఆమె పరిశీలించారు. ఈకేవైసీ నమోదుపై వ్యవసాయశాఖ అధికారులు, రైతులతో వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాతా సుఖీభవ పథకం కోసం రైతులు ప్రత్యేకంగా ఈకేవైసీ చేసుకునే అవసరం లేదన్నారు. రైతులు ఇదివరకే వేర్వేరు పథకాల కోసం ఈకేవైసీ చేసుకుని ఉంటే అదే సరిపోతుందని వివరించారు. అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులా, అనర్హులా అని తెలుసుకునేందుకు రైతుసేవా కేంద్రంలో గానీ, ఇంటర్నెట్‌లో ఆధార్ కార్డు ద్వారా కానీ స్టేటస్ తెలుసుకోవచ్చని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు యంత్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి అశోక్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, సహాయ గణాంక అధికారి శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మార్కెటింగ్ శాఖ ఏడీ



మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్

అనంతపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీగా రాఘవేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ మార్కెటింగ్ శాఖ ఏడీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు మార్కెట్ కమిటీల కార్యదర్శులు, ఏడీ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మార్కెట్ కమిటీల కార్యదర్శులు, ఉద్యోగుల సమన్వయంతో ముందుకు సాగుతామని అన్నారు. మార్కెట్ ఫీజు వసూలు ఇతరాత్ర వాటిలో రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తా అన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు.

సచివాలయ సిబ్బంది బదిలీలకు శ్రీకారం

- ఆన్‌లైన్‌లో ప్రక్రియ చేపట్టేలా ఉత్తర్వులు
- వివరాల నమోదులో సిబ్బంది నిమగ్నం

అనంతపురం న్యూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా అర్హత కలిగిన సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో యంత్రాంగం నిమగ్నమైంది. అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులు 483 ఉండగా.. 429 మంది పని చేస్తున్నారు. 54 ఖాళీలున్నట్లు అధికారులు తేల్చారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 పోస్టులు ఉండగా.. 334 మంది పనిచేస్తున్నారు. 85 ఖాళీలున్నాయి. వీరిలో ఉద్యోగంలో చేరినప్పట్నుంచి ఒకేచోట మే 31 వరకు పనిచేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్లు పూర్తికాని వారు రిక్వెస్ట్ పెట్టుకోవచ్చు. ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఖాళీల వివరాలు కూడా హెఆర్ఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బకాయిలు చెల్లించేవరకు రిలీవ్ చేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ వరకు మాడ్యూల్‌లో వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. 22 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో బదిలీల అభ్యర్థన పెట్టుకోవచ్చు. 25 నుంచి 29 వరకు వాటిని పరిశీలించనున్నారు. 30న ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి కలెక్టర్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ల బదిలీ

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ స్థాయి వరకు పలువురికి బదిలీలు జరిగాయి. జూమ్ ద్వారా సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మధు తెలిపారు. ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ అవుతారని తెలిపారు. పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి, పలువురు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. బదిలీల వివరాలు మంగళవారం తెలిసే అవకాశం ఉందని అన్నారు.

'మట్టి వినాయకులే మేలు'

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని నగరవాసులు మట్టి వినాయకుల ప్రతిమలు (విగ్రహాలు) మాత్రమే వినియోగించి పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి కోరారు. ఈ మేరకు నగరంలో మట్టి వినాయకుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులకు సూచించారు. పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలు, విగ్రహాల తయారీదారులు, హస్తకళాకారులు మట్టితో వినాయకులను తయారు చేసి వినియోగించాలని కోరారు. పీఓపీ, ప్లాస్టిక్, థర్మాకోల్ వాడకుండా విగ్రహాలను తయారు చేయాలన్నారు. పర్యావరణ అనుకూలమైన మట్టి పదార్థాలను ఉపయోగించడంతో నిమజ్జన సమయంలో కాలుష్యం లేకుండా నివారించవచ్చని తెలిపారు. మట్టి వినాయకులను పూజిద్దాం-పర్యావరణం పరిరక్షించుకుందాం అనే నినాదంతో వినాయకచవితి జరుపుకుందామని పిలుపునిచ్చారు.

నేటి నుంచి కేంద్ర కమిటీ పర్యటన

అనంతపురం అర్బన్ , జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్ మంగళవారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల పర్యటన షెడ్యూల్ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కమిటీ సభ్యులు జిల్లాకు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ వినోద్‌కుమార్‌తో సమావేశమవుతారు. సాయంత్రం 5 గంటలకు డ్వామా కార్యాలయంలోని జలశక్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. ఈనెల 18న ఉదయం 9 గంటలకు శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యకలాపాలను పరిశీలిస్తారు. చెక్ డ్యాంల పరిశీలనతో పాటు చిజిల్ నాగలితో లోతు దుక్కి చేయడాన్ని పరిశీలిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారు. 11 గంటలకు తాడిపత్రిలో మురుగునీటి శుద్ధికర్మాగారాన్ని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తాడిపత్రిలోని ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాంపాండ్స్‌ను పరిశీలిస్తారు. 3.30 గంటల నుంచి గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని పరిశీలిస్తారు. ఈనెల 19వతేదీ ఉదయం 9 గంటలకు కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. అనంతరం ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను పరిశీలిస్తారు.

7,152 మంది టీచర్ల బదిలీ

సహకరించిన అందరికీ ధన్యవాదాలు

జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. దాదాపు నెలరోజులుగా టీచర్ల బదిలీల ప్రక్రియ కొనసాగుతూ వచ్చిందన్నారు. రాష్ట్ర శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో టీచర్ల బదిలీల ప్రక్రియను పగడ్బందీగా చేపట్టామని అన్నారు. రికార్డుల ఆధారంగా జిల్లాలో అన్ని కేడర్ల టీచర్లు కలిపి 7,152 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని తెలిపారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు 133 మంది, ఎస్ఏ ఇంగ్లీష్ 511, ఎస్ఏ హిందీ 238, ఎస్ఏ తెలుగు 386, లెక్కలు 647, ఫిజికల్ సైన్స్ 518, బయాలజికల్ సైన్స్ 510, సోషియల్ 415, పీడీలు 415 మంది చొప్పున బదిలీ అయ్యారని వివరించారు. అలాగే సెకెండరీగ్రేడ్ టీచర్లు(ఎస్జీటీలు) 3,142 మంది స్థాన చలనం పొందారని అన్నారు. ఇతర ఉర్దూ, కన్నడ, వివిధ కేడర్లు కలిపి 464 మంది బదిలీ అయ్యారని డీఈఓ అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి నగరపాలక, మున్సిపాలిటీ టీచర్లతో పాటు ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలలో పనిచేసే టీచర్లందరినీ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బదిలీలు నిర్వహించామని పేర్కొన్నారు. బదిలీల ప్రక్రియకు సహకరించిన రాష్ట్ర ఉన్నతాధికారులు, కలెక్టర్, ఆర్జేడీ, స్పెషల్ ఆఫీసర్లు, ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

లేనిది ఉన్నట్లు..!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు జమయ్యాయి. ఇంకా 139 మందికి రావాల్సి ఉంది. వీరిలో అధిక శాతం మందికి 10 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు పొరపాటుగా చూపించారు. కానీ రెండు ఎకరాలకు మించి భూమి లేనివారు చాలామంది ఉన్నారు. అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాలతో మకు సొమ్ము దూరమైందని, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పది ఎకరాల భూమినైనా ఇవ్వండి..



నాకు ఇద్దరు కూతుళ్లు. మమత 10వ తరగతి, నవనీత 7వ తరగతి చదువుతున్నారు. ఉన్నది 1.79 ఎకరం భూమి. అది కూడా ప్రభుత్వం ఇచ్చిందే. కానీ ఆన్‌లైన్‌లో 10 ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపుతోంది. అనర్హుల జాబితాలో చేర్చి.. 'తల్లికి వందనం' అందకుండా చేశారు. మేము పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చూపినట్లు మాకు 10 ఎకరాల భూమిని ఇప్పిస్తే.. మరో 5 పాడి పశువులు పెంచుకుని పాలు అమ్ముకుంటాం. లేదంటే 'తల్లికి వందనం' ఇప్పించాలి.

-లక్ష్మీనారాయణమ్మ, తాడిమర్రి



తాడిమర్రి సచివాలయంలో తల్లికి వందనం గ్రీవెన్స్ కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

ఉన్నది ఒకటిన్నర ఎకరమే..



మా కుమారుడు దినేష్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసి, రెండో సంవత్సరం చదువుతున్నాడు. మాకు 1.50 ఎకరా డి.పట్టా భూమి ఉంది. కానీ 10 ఎకరాలకు పైగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపించారు. 'తల్లికి వందనం' అందకుండా చేశారు.

-నాగవేణి, తాడిమర్రి

భూములే భూములు..

సోమందేపల్లి మండలంలో లేని భూమి ఉన్నట్లు చూపడంతో 741 మందికి 'తల్లికి వందనం' దూరమైంది. బాధితులతో తహసీల్దార్ కార్యాలయం సోమవారం కిటకిటలాడింది. బ్రాహ్మణపల్లికి చెందిన సయ్యద్ రియాజ్‌కు 90 సెంట్లు భూమి ఉండగా 10 ఎకరాలు ఉన్నట్లు చూపించారు. వెలుగమాకులపల్లి నాగరాజుకు 2 ఎకరాలుంటే 10 ఎకరాలు, జూలకుంటకు చెందిన నరసింహులు 99 సెంట్లు ఉంటే పదెకరాలు, గుడిపల్లి అనంతమ్మకు 5 ఎకరాలు ఉంటే 10ఎకరాలు, కవితాబాయికి 4 ఎకరాలు ఉంటే 10 ఎకరాలు చూపించారు. మరికొందరికి సెంటు భూమి లేకున్నా పది ఎకరాలకు పైగా ఉన్నట్లు చూపించారు. ఆధార్ నమోదులో తప్పిదాల కారణంగానూ కొందరికి పథకం అందలేదు. సాంకేతిక కారణాలతో తప్పిదాలు జరిగాయని, జాయింట్ ఎల్‌పీఎంలో, రీ సర్వేలో లోపాలవల్ల ఆన్‌లైన్‌లో భూమి ఎక్కువగా నమోదైందని ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి అన్నారు. సమస్యను పరిష్కరించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.



సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హత్య కేసులో దంపతుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యబాబు

పుట్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 14న జరిగిన నడిపి కంబగిరి హత్యకేసులో సోమవారం దంపతులు గుర్రమ్మ, పెద్దకంబగిరిలను అరెస్ట్‌చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెద్దకంబగిరి, నడిపి కంబగిరి తరచూ ఆస్తి తగాదాల్లో భాగంగా ఇంటికోసం గొడవపడేవారన్నారు. దీంతో గత శుక్రవారం రాత్రి మరోమారు గొడవపడ్డారని తెలిపారు. పెద్దకంబగిరి కత్తి తీసుకొని నిద్రిస్తున్న నడిపి కంబగిరిని హత్య చేశాడన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేయగా ఆస్తి కోసమే చంపినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. దీంతో భార్యభర్తలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఉదయం ధర్మవరం పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీ వద్ద చోటుచేసుకుంది. హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుళ్లు ఎర్రిస్వామి, వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన గుండుగోపాల్ (57) తాగుడుకు బానిసై అనునిత్యం కుటుంబ సభ్యులను వేధించేవాడు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. దీంతో క్షణికావేశంతో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా పరిశీలించారు. భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

కూడేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇప్పేరు గ్రామానికి చెందిన మహేష్ (23) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మహేష్ అనే యువకుడు గత కొంత కాలంగా గ్రామంలోని నల్లలమ్మ దేవతకు పూజలు చేస్తూ కుటుంబ పోషణకు ఆసరాగా ఉండేవాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో కుటుంబ సభ్యులు గమనించి శవాన్ని కిందికి దించారు. మృతుడి తండ్రి రామన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామానాయుడు తెలిపారు.

కొరివిపల్లిలో గుర్తుతెలియని కారు



శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరివిపల్లిలో గుర్తుతెలియని కారును వదిలేశారు. గ్రామంలో నాగేశ్వర రెడ్డి ఇంటి సమీపంలో 15 రోజులు కిందట రాత్రి సమయంలో ఏపీ04ఏపీ2088 నంబరు గల కారును గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. కారు యజమానులు వచ్చి తీసుకు వెళతారని గ్రామస్థులు భావించారు. ఎవరూ రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

భార్యకు గాయాలు


శ్రీహరినాయుడు (ఫైల్)

నంబులపూలకుంట, జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడకంటివారిపల్లి సమీపాన సోమవారం ఎద్దుల బండిని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముక్కంవారిపల్లికి చెందిన శ్రీహరినాయుడు(36) దుర్మరణం చెందగా.. అతడి భార్య సింధూజ గాయపడింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరినాయుడు స్వగ్రామమైన ముక్కవారిపల్లి నుంచి భార్య సింధూజతో కలిసి ద్విచక్రవాహనంలో గాండ్లపెంటలోని రెక్కమానుకు ఇంటి సరుకులకోసం బయల్దేరాడు. మార్గమధ్యలో పెడకంటివారిపల్లి సమీపాన ఎదురుగా వస్తున్న ఎద్దుల బండి ఢీకొట్టింది. దీంతో శ్రీహరినాయుడు అక్కడికక్కడే మృతిచెందగా, సింధూజ గాయపడింది. ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి ప్రైవేటు వాహనంలో తరలించారు. శ్రీహరినాయుడుకు ఇద్దరు కుమారులు, ఆరు నెలల చిన్నారి ఉన్నారు. ఎస్ఐ వలీబాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించి, శవాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

వాసాపురం బాబును కలిసిన పెద్దారెడ్డి

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ


వాసాపురం బాబుతో భేటీ అయిన పెద్దారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్16(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యదర్శి రవీంద్రనాయుడు అలియాస్ వాసాపురం బాబును తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. యల్లనూరు మండలానికి చెందిన వాసాపురం బాబు పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం యల్లనూరు మండలంలోని వాసాపురం గ్రామంలో ఆయనను వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కలవడం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీసింది. దీనిపై పార్టీ అధిష్ఠానం ఆరాతీసినట్లు తెలిసింది.

పోక్సో కేసులో తండ్రీకొడుకుల అరెస్టు

అనంతపురం క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థి, అతడి తండ్రిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, ప్రథమ సంవత్సరం విద్యార్థి ప్రేమించుకున్నారు. మైనర్లు ఇద్దరూ ఇటీవల రెండుసార్లు ఇంటి నుంచి పారిపోయారు. బాలిక తల్లిదండ్రులు పలుమార్లు చెప్పినా మార్పురాలేదు. మరోసారి బాలికను తీసుకుని ఒంగోలుకు పారిపోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన దిశ పోలీసులు.. బాలుడిని, అతడి తండ్రిని అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని దిశ డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు.

ఆస్తి కోసమే అపహరణ

మారుతమ్మను ఎత్తుకుపోయిన తల్లిదండ్రులు, బంధువులు

మరిదిని పెళ్లి చేసుకోవాలని బెంగళూరులో చిత్రహింసలు

కేసును ఛేదించిన పోలీసులు.. 11 మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు


టీచర్ మారుతమ్మ, ప్రియుడు ఎర్రిస్వామి

కళ్యాణదుర్గం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయని మారుతమ్మను కన్న తల్లిదండ్రులు, బంధువులు ఆస్తి కోసం అపహరించారని డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన మేరకు, కంబదూరు మండలం కురాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో మారుతమ్మ ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. 2016లో ఆమెకు టీచర్ ఉద్యోగం వచ్చింది. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి ఆమె స్వగ్రామం. ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులు ఆనంద్, శ్యామలమ్మ, చెల్లెలు మహాలక్ష్మిని ఆమె పోషిస్తున్నారు. కుటుంబ పోషణకు పోనూ మిగిలిన సొమ్ముతో 15 తులాల బంగారం, అనంతపురంలో ఓ ఇంటి స్థలం కొనుగోలు చేశారు. మారుతమ్మకు పెళ్లి చేస్తే తమ జీవనానికి ఇబ్బంది అవుతుందని తల్లిదండ్రులు, చెల్లెలు భావించారు. అందుకే ఉద్యోగం వచ్చి 9 సంవత్సరాలు గడిచినా మారుతమ్మ పెళ్లి చేయలేదు. మారుతమ్మ సుమారు 20 ఏళ్ల నుంచి బెళుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన ఎర్రిస్వామిని ప్రేమిస్తున్నారు. ఎర్రిస్వామికి వివాహమై, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా ఎర్రిస్వామిని 20 రోజుల క్రితం మారుతమ్మ వివాహం చేసుకున్నారు. దీంతో వారు జీర్ణించుకోలేక పోయారు. ఎలాగైనా వారిని విడగొట్టాలని, లేదంటే చంపేయాలని తల్లిదండ్రులు, తమ్ముడు, మరిది, చెల్లెలు, మరో ఐదుగురు బంధువులు నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న మారుతమ్మ పాఠశాలకు వెళ్లి బైక్‌పై ఎర్రిస్వామితో కలిసి తిరిగి వస్తుండగా కంబదూరు మండలం కోటగుడ్డం వద్ద అడ్డగించారు. ఎర్రిస్వామిని తోసేసి, మారుతమ్మను కిడ్నాప్ చేశారు. తండ్రి ఆనంద్‌తో పాటు మరో 9 మంది బొలెరో వాహనంలో ఆమెను ఎత్తుకుపోయారు. ఈ ఘటనపై ఎర్రిస్వామి కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మారుతమ్మను కుటుంబ సభ్యులు, బంధువులు బెంగళూరుకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. చెల్లెలు మహాలక్ష్మి భర్త ఎల్లప్పను పెళ్లి చేసుకోవాలని, ఆస్తి, డబ్బు తమకు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. వారి నుంచి తప్పించుకునేందుకు మారుతమ్మ తెలివిగా ప్రవర్తించారు. మరిదిని పెళ్లి చేసుకుంటానని ఒప్పుకున్నారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆమెను బెంగళూరు నుంచి కళ్యాణదుర్గానికి తీసుకువస్తుండగా.. పోలీసులకు సమాచారం అందింది. కళ్యాణదుర్గం సమీపంలో ఈ నెల 15న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మారుతమ్మను రక్షించారు. ఆమె తల్లిదండ్రులు ఆనంద్, శ్యామలమ్మ, చెల్లెలు మహాలక్ష్మి, మరిది ఎల్లప్పతోపాటు ఏడుగురు బంధువులను అరెస్టు చేశారు. వారి నుంచి బొలెరో, ద్విచక్రవాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మూడు రోజుల్లోనే ఛేదింపు

టీచర్ కిడ్నాప్ కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్, టౌన్ సీఐ యువరాజు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కంబదూరు ఎస్ ప్రవీణ్, బొమ్మనహాల్ ఎస్ఐ నబీరసూల్, కణేకల్ ఎస్ఐ నాగమధు, పోలీస్ సిబ్బంది రాజేష్, ఖాజా, మంజునాథ్, నాగార్జున, మోహన్ కృష్ణ, రాజ్యలక్ష్మి, ఎస్‌బీ కానిస్టేబుల్స్ ఆంజినేయులు, మోహన్ తదతరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

విచ్చలవిడిగా మట్కా.. పేకాట..!

నామమాత్రంగా దాడులు

నిద్రావస్థలో పోలీసుశాఖ

బహిరంగంగానే చీటీలు రాస్తున్న బీటర్లు


డీఎస్పీ కార్యాలయం

తాడిపత్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పరిశ్రమలతో తాడిపత్రి ఆర్థికంగా ముందంజలో ఉంటుంది. అదే రీతిలో ఇక్కడ మట్కా, పేకాట కూడా విచ్చలవిడిగా సాగుతున్నాయి. గతంలో వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే వారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇటీవల నేరుగానే బీటర్లు బహిరంగంగా చీటీలు రాస్తున్నారు. ఎక్కువ డబ్బులకు ఆశపడి నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడుతున్నాయి. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణలు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాడిపత్రి పట్టణం కర్నూలు, కడప, అనంతపురం మూడు జిల్లాలకు సరిహద్దు కావడంతో వేలమంది మట్కా ఆడడానికి కేంద్రబిందువు చేసుకున్నారు. నెల్లూరు, చిత్తూరు ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి మట్కా నిర్వహిస్తున్నారంటే ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ హయాంలో మట్కా బీటర్లకు కొందరు నాయకులు అండదండలు ఉండడంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆనవాయితీని ప్రస్తుతం కూడా కొనసాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

బహిరంగంగానే..

గతంలో వాట్సాప్, ఆన్‌లైన్‌లో మట్కాను ఆడేవారు. ప్రస్తుతం పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో బీటర్లు రెచ్చిపోతున్నారు. బహిరంగంగానే చీటీలు రాస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వందల సంఖ్యలో కూలీలు వలసవచ్చి జీవనం సాగిస్తున్నారు. సంపాదించిన కూలి డబ్బులను సాయంత్రమయ్యేసరికి మట్కా ఆడేందుకు ఆసక్తిచూపుతున్నారు. దీంతో సంపాదించిన డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలవుతున్నారు. ఈ మధ్యకాలంలో కొందరు మహిళలు కూడా మట్కాకు బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రంగా దాడులు చేయడం.. చిన్నాచితక వారిని అరెస్ట్ చూపడం, కొంత డబ్బును స్వాధీనం చేసుకోవడం తప్ప.. ముఖ్యమైన వ్యక్తులను అరెస్ట్ చేయలేదన్న విమర్శలు ఉన్నాయి.

రాయలసీమలోనే తాడిపత్రి టాప్

ఒకప్పుడు జిల్లాలో తాడిపత్రి మట్కా కింగ్‌గా ఉండేది. దినదినాభివృద్ధి చెంది రాయలసీమలోనే టాప్ ర్యాంక్‌లో తాడిపత్రి నిలిచింది. మట్కా కేంద్రాలను నిర్వహించే డాన్‌లకు సైతం తాడిపత్రి స్థిరనివాసంగా ఉండేది. అప్పట్లో లక్షల్లో టర్నోవర్ చేసేవారు. ప్రస్తుతం మట్కా ఆడే వారి సంఖ్య పెరగడంతో టర్నోవర్ కూడా కోట్లకు చేరింది. తాడిపత్రి పట్టణం, పెన్నానది పరివాహక ప్రాంతంలోని తోటలు, పరిశ్రమల్లో విచ్చలవిడిగా పేకాట నిర్వహిస్తున్నారు. పట్టపగలే ఎక్కడపడితే అక్కడ పేకాటస్థావరాలు వెలుస్తున్నాయి. పెన్నానదిలో కూడా ఆడుతున్నారంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

చర్యలు తీసుకుంటాం..



తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో మట్కా, పేకాటపై దాడులు నిర్వహిస్తున్నాం. ఇంకా కొన్నిచోట్ల ఆడుతున్నారని తెలిసింది. వారిని కూడా త్వరలో పట్టుకుంటాం. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మట్కా, పేకాటపై కమిటీ ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం. వీటిపై ప్రజలు సమాచారం ఇస్తే వారికి పారితోషికం కూడా అందజేస్తాం. వారిపేర్లను గోప్యంగా ఉంచుతాం.

- రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ

జగనన్న మాయాగృహాలు..!


- గత ప్రభుత్వంలో మోసం
- పట్టా ఇచ్చి.. స్థలం చూపని దుస్థితి..
- ఇల్లు కూడా మంజూరు చేశారట..
- పేదల సొంతింటి కలపై నీళ్లు

గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్లలో మాయాజాలమే ప్రదర్శించారు. కొందరికి ఇళ్ల పట్టాలిచ్చారు. స్థలం ఎక్కడో చూపలేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం లేఅవుట్‌ను కూడా చదును చేయలేదు. ఐదేళ్లూ అలానే గడిపేశారు. పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఆ కల నెరవేర్చుకుందామని పేదలు.. ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళితే పెద్ద షాక్. గత ప్రభుత్వంలో స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేసినట్లు ఆన్‌లైన్‌తో చూపుతోంది. ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో పేదలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

నల్లమాడ, జూన్16(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో నిరుపేదల కోసం గత వైసీపీ ప్రభుత్వం స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. జగనన్న కాలనీ ఏర్పాటుకు ఉపక్రమించింది. నల్లమాడ సమీపంలోని పాతరకుంట వద్ద ప్రభుత్వ ప్రైవేటు భూములు 18 ఎకరాలు సేకరించారు. ఆ భూమిలో చిన్న చిన్న గుట్టలు, బండరాళ్లు ఉన్నాయి. వాటిని తొలగించి, చదును చేసేందుకు రూ.60లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ఆ పనులు ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారు సొంత నిధులు వెచ్చించి చదును చేశారు. అనంతరం ఆ భూమిలో అర్హులైన వారందరికీ పట్టాలిస్తామని చెప్పి 500 మందికిపైగా పేర్లను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సమాచారం. ఇందులో 200 మందికి ఇళ్ల పట్టాలిచ్చినట్లు తెలుస్తోంది. స్థలం ఎక్కడుందో చూపలేదు. వారికి ఇళ్లు కూడా మంజూరుకాలేదు. పట్టాలిచ్చారనీ, ఇల్లు కూడా మంజూరు చేస్తారని పేదలు సంబరపడ్డారు. వారి ఆశలపై గత ప్రభుత్వం నీళ్లు చల్లింది. భూమిని చదును చేసిన కాంట్రాక్టర్లకు రూ.60లక్షల బిల్లులు కూడా రాలేదు. 18 ఎకరాల్లో రోడ్డు, నీటి సౌకర్యం, విద్యుత్ స్తంభాలుకానీ ఏర్పాటు చేయలేదు. మండలంలోని దొన్నికోట, పులగంపల్లి, బొంగపల్లి, రామాపురం, రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లి తదితర పంచాయతీల్లో జగనన్న కాలనీల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామాలకు దూరంగా ప్రభుత్వ భూములను చదును చేశారు. వాటిలో అరకొరగానే ఇళ్లు మంజూరు చేశారు. కొంతమంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. రెండు పంచాయతీల్లో మినహా జగనన్న కాలనీలన్నీ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. గతంలో లబ్ధిదారులు.. అధికారుల వద్దకెళ్లి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. ఇళ్లు మంజూరు చేయలేదు, కట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నేరవేర్చుకోవాలని లబ్ధిదారుల భావించారు. అధికారుల వద్దకెళ్లి పరిశీలించి గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరైందనీ, మళ్లీ ఆన్‌లైన్ చేయడం కుదరదని చెబుతున్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారు ఎక్కువమంది ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నల్లమాడ వద్ద జగనన్న కాలనీ కోసం చదును చేసిన భూమి

పట్టాలిచ్చారు.. స్థలాలు చూపలేదు



గత వైసీపీ ప్రభుత్వంలో నల్లమాడ సమీపంలో చదును చేసిన భూమి లో కొంతమందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. స్థలాలు చూపించలేదు. ఇళ్లు మంజూరు చేయలేదు. ఈ సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లినా, లబ్ధిదారులకు న్యాయం చేయలేదు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేపడతాం.

-కుచ్చెపు చంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

వసతులు కల్పించాక పట్టాలిస్తాం

నల్లమాడ సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో వసతులు కల్పించాల్సి ఉంది. భూమి కూడా పూర్తిస్థాయిలో చదును చేయాల్సి ఉంది. పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాలు అందజేస్తాం.

-రంగనాయకులు, తహసీల్దార్, నల్లమాడ

సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత నెల్లూరు


ట్రోఫీతో నెల్లూరు జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల విజేతగా నెల్లూరు జట్టు నిలిచింది. సోమవారం స్థానిక అనంతతపురం క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించారు. అనంతపురం-నెల్లూరు జట్లు తలపడగా..మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 48.5 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు ఎంకే దత్తారెడ్డి 58, అర్జున్ టెండూల్కర్ 43, మహేంద్రరెడ్డి 58, రాజుకుళ్లాయప్ప 44 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 49.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 296 పరుగులు సాధించింది. బ్యాటర్లు రేవంత్‌రెడ్డి 88, భాజీ 47 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు వికెట్ తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్ కడప, కర్నూలు జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 285 పరుగులు సాధించింది. బ్యాటర్లు దనుష్ 77, జయవర్ధన్ 57 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు కడప బౌలర్ల ధాటికి 179 పరుగులకే కుప్పకూలింది. సూర్యతేజ 45, సంజయ్‌నాయుడు 42పరుగులు చేశారు. కడప బౌలర్ దనుష్ 4, ఆరీఫ్‌బాషా 3 వికెట్లు సాధించి జట్టుకు 106 పరుగుల విజయాన్ని అందించారు. పాయింట్ల ఆధారంగా నెల్లూరు 16 విజేతగా, తరువాతి స్థానాల్లో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జట్లు నిలిచాయి. అనంతరం విజేత జట్టుకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి బీమలింగారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

మార్కెట్‌కు వెయ్యి టన్నుల చీనీ

అనంతపురంరూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వెయ్యి టన్నులకు పైగా చీనీ ఉత్పత్తులు వచ్చాయి. ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తంగా 1119టన్నుల కాయలు మార్కెట్‌కు వచ్చాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. టన్ను గరిష్టంగా రూ.32వేలు, కనిష్టంగా రూ.5వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేశారు

- వైసీపీ నాయకులపై జేసీపీఆర్ ఫైర్


మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జూన్16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేసి అధోగతి పట్టించి వెళ్లిపోయారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు పేర్నినాని, దేవినేని అవినాష్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు మంచితనమే మిమ్మల్ని కాపాడుతోందని అన్నారు. రాష్ట్రాన్ని చక్కదిద్దాలంటే చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. ఆయన మూడునెలలు పర్మిషన్ ఇస్తే టీడీపీ కార్యకర్తల సత్తా ఏమిటో చూపిస్తారని తెలిపారు. లోకేష్ యాత్ర పెడితే అడ్డుకోవడమే కాకుండా మాట్లాడుతున్న మైకును గుంజుకోలేదా అని ప్రశ్నించారు. పేర్నినాని భార్యపైన కేసులు పెట్టారని బాధపడుతున్నాడని, పేదలకు ఇచ్చిన బియ్యాన్ని నొక్కేయడం సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. తన భార్య మీద 10 కేసులు, కోడలిమీద రెండు కేసులు పెట్టిన ఘటనలు.. తమ ఇంటిలోకి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చి వెళ్లినది మర్చిపోయారా అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడి, ఎంతో కష్టపడి పార్టీని గట్టెక్కించారని అన్నారు. చంద్రబాబునాయకుడు కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసమే పనిచేస్తున్నారని, ఆయనకు కక్షసాధింపులు లేవని తెలిపారు. అందువల్లే మీరు ప్రశాంతంగా తిరగగలుగుతున్నారని వైసీపీ నాయకులకు గుర్తు చేశారు.

సోనాక్షి..!

స్కేటింగ్‌లో బుక్కరాయసముద్రం చిన్నారికి గోల్డ్‌మెడల్



బుక్కరాయసముద్రం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐదేళ్ల చిన్నారి సోనాక్షి స్కేటింగ్‌లో అదరగొట్టింది. కుమ్మర వేణుగోపాల్, మౌనిక దంపతుల కుమార్తె సోనాక్షి ఇటీవలే తిరుపతిలో నిర్వహించిన స్కేటింగ్ జోనల్ ర్యాంకింగ్ టోర్నీలో గోల్డ్‌మెడల్ సాధించింది. చిన్నారిని కోచ్‌లు, గ్రామస్థులు అభినందించారు.

పంచాయతీరాజ్‌లో సీతయ్య..!

ఎవరి మాటా వినడు.. ఎక్కడ పనిచేసినా వివాదమే..

నాయకుల పేర్లు చెబుతూ బెదిరింపులు

చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు..

అనంతపురం న్యూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ పరిధి పీఆర్ఐ సబ్‌డివిజన్-2లో ఓ జేఈ సీతయ్యలా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు అంటే లెక్కలేనితనం. ఏకంగా వారి చాంబర్లలోకే వెళ్లి గట్టిగట్టిగా అరుస్తాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా, ఉన్నతాధికారులు చోద్యం చూశారట. ఎందుకంటే ఆ జేఈ.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతాడన్న చర్చ సాగుతోంది. ఆయన విషయాల్లో కలుగజేసుకోవాలంటే ఉన్నతాధికారులు సైతం ఆలోచిస్తారట. ఎందుకులే అని వదిలేస్తారని చర్చ సాగుతోంది. ఉన్నతాధికారుల పరిస్థితే అలా ఉంటే.. కిందిస్థాయి ఉద్యోగుల గురించి వేరే చెప్పక్కర్లేదు. ఆ జేఈ.. చుక్కలు చూపిస్తాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పని చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారని తెలుస్తోంది. ఆ జేఈ నోటి దురుసుతో విసుగు చెందిన సిబ్బంది బదిలీపై వెళ్లిపోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఆ జేఈ సబ్ డివిజన్‌కు వెళ్లేవారే లేరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చినా.. ఆ జేఈని నిలదీసే సాహసం ఉన్నతాధికారులే చేయలేకపోతున్నారట.

తల్లికి వందనంపై విషం కక్కుతున్న వైసీపీ

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికివందనం పథకం అమలుపై వైసీపీ నేతలు విషం కక్కుతున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అయితే వైసీపీ నాయకులకు మాత్రం ఇది రుచించలేదన్నారు. అందుకే లేనిపోని అపద్ధాలు చెబుతూ విషం కక్కుతున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో 42 లక్షల మందికి అమ్మ ఒడి ఇచ్చారన్నారు. అదే ప్రస్తుత తమ ప్రభుత్వం 67.27 లక్షల మందికి తల్లికి వందనం ఇచ్చామని , ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ వర్తింపజేశామని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ వారు చావకబారు మాటలు మాట్లాడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు పాదర్శకతకు పెద్ద పీట వేస్తూ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శింగనమల టీడీపీ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు పసువుల శ్రీరామిరెడ్డి, మాసూల చంద్రమోహన్, గుర్రంలక్ష్మినారాయణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు..

డీపీఆర్వో బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన డీపీఆర్వో బాలకొండయ్య

అనంతపురం కలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి(డీపీఆర్వో)గా బాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని డీపీఆర్వో కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా డీఐఆర్వోగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. చిత్తూరులో సహాయ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహించిన వెంకరమణ జిల్లా పౌర సంబంధాల అధికారిగా, శ్రీ సత్యసాయి జిల్లాలో ఏపీఆర్వోగా విధులు నిర్వహించిన ఫకృద్దీన్ జిల్లాకు బదిలీపై వచ్చి పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వారికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓలు..

అనంతపురం అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓలుగా శశికళ, వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం, చిలమత్తూరు వ్యవసాయాధికారులుగా ఉన్న శశికళ, వంశీకృష్ణను జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓలుగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో పాత స్థానాల్లో రిలీవ్ అయ్యి, కొత్త స్థానాల్లో వారు బాధ్యతలు స్వీకరించారు.

హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈ..

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా పార్థసారథి బాధ్యతలు స్వీకరించారు. మైనర్ ఇరిగేషన్ అనంతపురం డిప్యూటీ ఎస్ఈగా ఉన్న ఆయన్ను హెచ్చెల్సీ లోకలైజేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేసిన సంగతి విధితమే. సోమవారం నంగరంలోని హెచ్చెల్సీ కాలనీలో గల లోకలైజేషన్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు లోకలైజేషన్ ఈఈగా పనిచేస్తున్న వెంకట రమణారెడ్డి గత నెల రిటైర్డ్ అయ్యారు.

తహసీల్దార్‌గా శేషారెడ్డి..

శింగనమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతన తహసీల్దార్‌గా శేషారెడ్డి బాధ్యతలు సీక్వరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య కణేకల్లుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి పుట్లూరు తహసీల్దార్‌గా ఉన్న శేషారెడ్డి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే ఇక్కడి ఏఎస్ఓ నాగలక్ష్మి బదిలీ కాగా.. ఆమె స్థానంలోకి గుంతకల్లు నుంచి సుభాషిణ వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

జిల్లావాసికి యువ పారిశ్రామికవేత్త అవార్డు

అనంతపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లావాసికి యువ పారిశ్రామికవే త్త అవార్డు వరించింది. తాడిపత్రి పట్టణానికి చెం దిన యశ్వంత్ చిన్న వయసులోనే అత్యధికంగా 10 వేలకు పైగా ఈవెంట్స్ నిర్వహించారు. దీంతో సోమవారం సాయంత్రం ఆయనకు ఢిల్లీలో ఓక్ ఆ ర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సీనియర్ పారిశ్రామికవేత్తలు ఆకాష్ జైపూర్యా, సునీల్ బన్స్వాల్‌ల యువ పారిశ్రామికవేత్త అవార్డు అందజేసి సత్కరించారు.

చివరి ఆయకట్టు వరకు నీరివ్వాలని వినతి

శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ చివరి ఆయకట్టు వరకు నీరు తీసుకురావాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు తరిమెల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రంగన్న, శంకర్, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు అభినందనలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో మాంటిస్సోరి నిర్వాహకులు

రాప్తాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండలంలోని గొల్లపల్లి వద్ద గల మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇందుకు గాను వారిని ఎండీ కృష్ణ భరత్, కరెస్పాండెంట్ కృష్ణ సమీర సోమవారం పాఠశాలలో మెమొంటోలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాసిని, సుజన్, రితేష్, హర్ష, చరణ్‌లు ప్రతిభ కనబర్చారన్నారు. పాఠశాలలోని 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాప్తాడులో యోగాంధ్ర

● హాజరుకానున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలోని పండమేటి వెంకరమణస్వామి ఆలయం పక్కన గల పార్కులో మంగళవారం ఉదయం యోగాంధ్ర నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. తెల్లటి దుస్తులు, యోగా మ్యాట్‌తో రావాలని సూచించారు.

పన్నులు తప్పనిసరిగా వసూలు చేయాలి

● అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బకాయిదారుల నుంచి పన్నులు తప్పనిసరిగా వసూలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం సాయంత్రం ఆయన వాణిజ్య పన్నుల శాఖ, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పన్నుల శాఖ నుంచి ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీ, ఐజీఎస్టీ లాంటి మూడు రకాల పన్నులు వసూలు చేయాలని, పన్నుల వసూలు లక్ష్యం చేరుకునేందుకు ఆయా శాఖల వారిగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. జిల్లాలో 32వేల మంది వరకు టాక్స్ పేయర్స్ ఉన్నారని, అందులో ఎవరైతే పన్నులు చెల్లించాల్సి ఉందో వారిని ముక్కు పిండి చేయాలని అన్నారు. ప్రొఫెషనల్ టాక్స్ 50శాతం ఇంకా రావాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఐఎంఏ, లా అసోసియేషన్ తదితర సంస్థల వారికి లేఖ రాయాలన్నారు. పన్నుల వసూలుకు సంబంధించి నెలవారిగా నివేదిక అందజేయాలన్నారు. టీడీఎస్ గురించి జిల్లా అధికారులకు శిక్షణ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో మలోల, పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ శేషాద్రి, హౌసింగ్ పీడీ శైలజ, మైన్స్ ఏజీ ఆదినారాయణ, పీఆర్ జహీర్ అస్లాం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాస్‌యాదవ్, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, పన్నుల శాఖ డీసీ మురళీమనోహర్, మేనేజర్ సంజీవరెడ్డి, సీటీఓ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వరాదు: డీఎస్పీ



తరిమెల ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అనుమతులు ఉన్నాయని ఇసుకను ఎక్కడబడితే అక్కడ తవ్వడానికి వీల్లేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వరు సూచించారు. మండలంలోని తరిమెల గ్రామంలో అనుమతి ఉన్న ఇసుక రీచ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు ఎక్కడైతే పట్టా భూముల్లో అనుమతి ఇచ్చారో.. అక్కడే వారు చెప్పిన నిబంధనల ప్రకారం ఇసుక తీయాలని రీచ్ నిర్వాహకులకు సూచించారు. అలా కాకుండా వంకల్లో, నదుల్లో తవ్వకాలు జరిపితే ఉపేక్షించేదిలేదన్నారు. ఇసుకను రీచ్ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే వాహనాల డ్రైవర్లకు లైసెన్సులు ఉండాలన్నారు. అలాగే వావాహల రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. ఇసుకను ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తరలించాలన్నారు. ప్రతి ఇసుక తరలింపు సమయంలో అందుకు సంబంధించిన బిల్లులు ఉండాలన్నారు. అధికారుల ఇచ్చిన నింబంధల ప్రకారమే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. అనుమతులు లేని చోట తవ్వితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కౌలుట్లయ్య , ఏఎస్ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

గార్లదిన్నె: అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని కల్లూరు అగ్రహారంలో కొందరు ఊటకాలువను పూడ్చి మట్టిని తరలిస్తుండడంపై రైతులు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన స్థానిక ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషాతో కలిసి కల్లూరులో పర్యటించారు. అక్కడి సమీపంలోని పెన్నానదిని, ఊటకాలువను పూడ్చి మట్టి తరలించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మట్టి తరలించే గ్రామాల్లో రాత్రి సమయంలో గస్తీ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సాయంత్రం తహసీల్దార్ బండారు ఈరమ్మ కూడా పూడ్చిన ఊటకాలువను పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీబాలుర వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని వార్డెన్ శంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు హాస్టల్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఎస్సీ విద్యార్థులకు 70శాతం, ఎస్టీలకు రూ.5శాతం, బీసీలకు 9శాతం, ఓసీలకు 4శాతం, ఆదిఆంధ్రులకు12శాతం సీట్లు ఉన్నాయన్నారు ఆసక్తి ఉన్న వారు హాస్టల్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8008633290, 8919254720 ను సంప్రదించాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అనంతపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దివాకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

టీడీపీ నాయకుల సంబరాలు



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం అమలు అయినందుకు మండలంలోని ఆకుతోటపల్లి గ్రా మంలో టీడీపీ నాయకు లు సోమవారం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులతో కేక్ కట్ చేయించారు. అలాగే సీఎం చంద్రబా బు, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. తల్లివందనం అమలుతో ప్రతి తల్లిమోములో ఆనందం వెల్లువిరుస్తోందని అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాగేమురళీ మోహన్, నాయకులు మేకల చలపతి గౌడ్, జయరాముడు, డీసీ బాబు, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన



ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి నేతలు

అనంతపురం విద్య, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంలో కళాశాల ఎలా నిర్వహిస్తారంటూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు నగరంలోని ఆర్ఐఓ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్షర కళాశాల భవనం నిర్మాణంలో ఉందని, అప్పుడే అందులో కళాశాల ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. ఆకళాశాలకు ఎలా పర్మిషన్ ఇచ్చారని మండిపడ్డారు. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహించారు. ఈ క్రమంలో ఆర్ఐఓతో వాగ్వాదానికి దిగారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ హామీఇవ్వడంతో వారు ఆందోళన విరమించి వినతి పత్రం అందజేశారు. నాయకులు అబ్దుల్‌అలాం, రామన్న, నరసింహ,ప్రతిభ, తేజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ సాధికారత ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షారభ్యాసం కార్యక్రమాన్ని తలపెట్టారు. ఇందులో భాగంగా సోమవారం పాతూరులోని 12వ డివిజన్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షారభ్యాసానికి సీడీపీఓ అనూరాధ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రథమ విద్యార్థిగా చిన్నారులకు అంగన్వాడీ కేంద్రం అమ్మ ఒడిలాంటిదన్నారు. బుడి బుడి అడుగులతో కేంద్రానికి వచ్చే చిన్నారులతో తొలి అక్షరాలను దిద్దించేందుకు అక్షర్యాభ్యాసం వేడుకను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జయభారతి, మాధవీలత, 12వ డివిజన్ కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ అనూరాధ

విద్యుత్ తీగలను సరిచేశారు..



విద్యుత్ తీగలను సరిచేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాప్తాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం గ్రామంలో కందుకూరు రోడ్డు వద్ద గల రైతు జానగొండ ప్రసాద్ పొలంలో చేతికందే ఎత్తు లో ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను అధికారులు సరి చేశారు. విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉండడంపై ఈనెల 14వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన రాప్తాడు విద్యుత్ ఏఈ శివప్రసాద్‌నాయుడ సోమవారం సిబ్బందితో కలిసి రైతు పొలం వద్దకు వెళ్లి నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి కిందకు వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలను పైకి లాగి సమస్య పరిష్కరించారు.

విజిలెన్స్ అధికారుల విచారణ



విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ, సీఐ కే.శ్రీనివాసులు విచారణ చేపట్టారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వారు పంచాయతీ కార్యదర్శుల వద్ద నున్న ఆ కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను, క్విట్ వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఏఓ నాగభూషణరెడ్డి, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది. నగరంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన బ్రహ్మాచారి (78) రెండు రోజుల కిందట తన మనవరాలితో కలిసి బైక్‌పై వస్తూ పాతూరులో రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తర్వాత సోమవారం మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులు కిటకిట..

● 'తల్లికి వందనం' డబ్బులు, ఉపాధి బిల్లులు డ్రా చేసుకునేందుకు పెద్దఎత్తున వచ్చిన ప్రజలు



బ్యాంకులో కిక్కిరిసిన జనం

శింగనమల జూన్16 (ఆంధ్రజ్యోతి) తల్లికి వందనం డబ్బులు, ఉపాధి హామీ బిల్లులు ఖాతాల్లోకి జమ కావడంతో సోమవారం బ్యాంకులన్నీ తల్లిదండ్రులు, ఉపాధికూలీలతో నిండిపోయాయి. మండలకేంద్రంలోని కెనారా బ్యాంకుకు పెద్దఎత్తున తరలివచ్చి డబ్బులు డ్రా చేసుకున్నారు. బ్యాంకు కిటకిటలాడింది. అయితే స్థానిక పోస్టాఫీసు ఇందుకు భిన్నంగా మారింది. ఉదయమే పోస్టుఫీసు వద్దకు తల్లిదండ్రులు, ఉపాధికూలీ భారీగానే చేరుకుని డబ్బులు డ్రా చేయించాలని అక్కడి సిబ్బందిని కోరగా.. ఇక్కడ డబ్బులు లేవని చేతులెత్తేశారు. చేసేదిలేక వారంతా నిరాశతో వెనుదిరిగారు. పోస్టుమాస్టర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తల్లికివందనం, ఉపాధి బిల్లుల కోసం మా బ్రాంచ్ తరపున రూ.5లక్షలు కావాలని పైఅధికారులకు ఇండెంట్ పంపామని, ఆ డబ్బులు రాగానే ఖాతాదారులకు అందజేస్తామని తెలిపారు.

చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలి

● సిబ్బందికి నగర కమిషనర్ బాలస్వామి సూచన



మటన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని.. నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సిబ్బందికి సూచించారు. నగరంలోని పాతూరు ఆసార్‌వీధి, మున్నానగర్‌లో సోమవారం ఆయన ఇంటింటి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. చెత్త సేకరణ ట్రాక్టర్‌కు కచ్చితంగా మైకు ఏర్పాటు చేసుకోవాలని, చెత్త సేకరణ సజావుగా చేపట్టాలని తెలిపారు. అనంతరం పాతూరు మటన్‌మార్కెట్‌ను పరిశీలించి వ్యాపారులు చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్డుపై ఎటువంటి వ్యర్థాలను వేయరాదని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని...వాటికి ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తర్వాత అక్కడి అన్న క్యాంటీన్‌ను పరిశీలించి... అల్పాహారం నాణ్యతను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అంజనేయులు, శానిటేషన్ సెక్రటరీ రమేష్ ఉన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

● నగర కమిషనర్‌కు సీఐటీయూ నాయకుల వినతి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు తల్లికివందనం వర్తింప చేయాలన్నారు. పారిశుధ్య విభాగంలో 409మంది, ఇంజనీరింగ్ విభాగంలో 309మంది కార్మికులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారని... చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణను భారంగా నెట్టుకొస్తున్నారని తెలిపారు. వారిని ఆదుకోవాలని కోరారు. అలాగే వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు ప్రజలు కమిషనర్‌కు ఏడు వినతి పత్రాలు అందజేశారు.

వారి సినిమాలను బహిష్కరించాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ వేదికలో జై తెలంగాణ అంటూ నినదించిన టాలీవుడ్ హీరోల సినిమాలను ఆంధ్రప్రదేశ్‌లో బహిష్కరించాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవా రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010 నుంచి 2014 వరకు సమైక్యాంధ్ర ఉద్యమం జరిగితే, 2019 నుంచి 2024వరకు రాజధాని అమరావతే కావాలని ఆంధ్రప్రజలు చేసిన ఉద్యమానికి ఏనాడూ టాలీవుడ్ హీరోలు మద్దతు తెలపలేదన్నారు. టాలీవుడ్‌లో హీరోలు, డైరెక్టర్లు, కెమెరామెన్లు, అనేకమంది నటులు ఇతర సినీ రంగాల్లో 90శాతం ఆంధ్రా వాళ్లు ఉన్నా.. ఏనాడూ జై ఆంధ్రా... జై అమరావతి అనలేదని గుర్తుచేశారు. టాలీవుడ్‌లోని సినీ పరిశ్రమలో ప్రతి ఒక్కరూ స్వార్థం కోసం, స్వలాభం కోసం, ఆస్తులు కూడగట్టుకునేందు కోసం జై తెలంగాణ అనే నినాదం చేస్తున్నారన్నారు. ఇది ఆంధ్ర ప్రజల మనోభావాలను తాకట్టుపెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి టాలీవుడ్ నటుల సినిమాలను ఆంధ్రప్రదేశ్‌లో బహిష్కరించాలని కోరారు.

కూటమి పాలన అంతా మోసమే: వైసీపీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సాగించిన ఏడాది పాలనలో అంతా మోసమే ఉంద ని, సంక్షేమం ఎక్కడా లేదని వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త సాకే శైలజానాథ్ విమర్శించారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి జగన్ అంటేనమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం లేద న్నారు. అన్నీ అపద్ధాలు, మోసాలే ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీరామిరెడ్డి, నారాయణరెడ్డి, మిద్దెకుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊటకాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు అగ్రహారం గ్రామంలో ఊట కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అగ్రహారం గ్రామంలోని ఊట కాలువ కొన్నేళ్లుగా ఉందన్నారు. ఆ కాలువ కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర రైతులకు సంబంధించి సుమారు 200 ఎకరాల భూమి సాగులో ఉందన్నారు. అయితే కొంతమంది మట్టిని తోలుకునేందుకు ఊటకాలువను పూడ్చివేశారన్నారు. ఆ కాలువను పూడ్చడంతో సాగు భూములకు ఇబ్బందిగా మారిందన్నారు. ఊటకాలువను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేసి తగిన చర్య లు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, సుబ్రహ్మణ్య ప్రసాద్, రామస్వామి, రాము, ఆంజనేయులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలపై చర్యలు తీసుకోండి

అనంతపురం విద్య, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకురాళ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ సమాజంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఎక్కడ చూసినా అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మేల్కొని అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పద్మావతి, పార్వతి, లక్ష్మిదేవి, సునీత, నాగమ్మ, స్వాతి, జానకి,అరుణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా సమాఖ్య నేతలు

ఖరీఫ్ సాగుకు సమాయత్తం


కూడేరులో విత్తనాలను సిద్ధం చేస్తున్న మహిళలు


బెళుగుప్పలో ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయిస్తున్న రైతు

పనుల్లో రైతులు బిజీబిజీ

కూడేరు/బెళుగుప్ప జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో పొలాలను దుక్కులు దున్ని విత్తనం చేయడానికి సిద్ధం చేశారు. కూడేరు మండలంలో దాదాపు 15వేల హెక్టార్లలో వేరుశనగ, కంది, ఆముదం, జొన్న తదితరు పంటలు సాగు చేయడానికి అన్నదాతలు అవసరమైన విత్తనాలను నిల్వ చేసుకున్నారు. గత ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడతో వేరుశనగ సాగు తగ్గింది. మూడు సంవత్సరాలుగా అన్నదాతలు వేరుశనగ పంట సాగు తగ్గించి కంది, ఆముదం తదితర అంతర్‌పంటల వైపు మొగ్గు చూపారు. ఈ ఏడాది వేరుశనగ పంటకు మార్కెట్‌లో ధర అధికంగా పలుకుతుండటంతో అన్నదాతలు వేరుశనగ పంట సాగు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 8520 హెక్టార్లలో వేరుశనగ, 1962 హెక్టార్లలో కంది, 2234 హెక్టార్లలో ఆముదం పంటతోపాటు మరో రెండు వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పెరస, తదితర పంటలు సాగుకు సిద్ధంగా ఉన్నారని వ్యవసాయశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన కాయలు సరఫరా చేశారు. దీంతో అన్నదాతలు కాయల నుంచి విత్తనాలను వేరుచేసే పనిలో బిజీగా ఉన్నారు. మరోపక్క పొలాల్లో కంది, ఆముదం కొయ్యలను తొలగించి శుభ్రం చేశారు. వర్షం కురిస్తే.. విత్తనం వేయడానికి అవసరమైన ఏర్పాట్లలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

● బెళుగుప్ప: మండలంలో పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పంటల విత్తనం సాగుకు ఎర్రనేల భూములు బాగా పదునయ్యాయి. అదునుకు పదును కావడంతో వేరుశనగ కందిపంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ట్రాక్టర్ సేద్యం అలవాటుపడిన రైతు లు ప్రస్తుతం ఏ పంటైనా ట్రాక్టర్‌ను బాడుగలు తీసుకుని వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంటలు విత్తనాలు వేసేందుకు విత్తన గొర్రు గుంటకలు రైతులు మరమ్మతులు చేయిస్తున్నారు. దీంతో మెకానిక్ షెడ్లు కిటకిటలాడుతున్నాయి.

వాతావరణం అనుకూలిస్తే..



ఖరీఫ్‌లో కందిపంట సాగుకు 25 ఎకరాలు కౌలుకు తీసుకుని విత్తనాలు వేస్తున్నాం. అన్ని సిద్ధంగా ఉంచుకున్నాం. వాతావరణం అనుకూలిస్తేనే విత్తనాలు వేస్తాం.

-రాజన్న, కౌలు రైతు, ఎర్రగుడి, బెళుగుప్ప

15 వరకు సమయం ఉంది..

ఖరీఫ్ పంటల సాగుకు జూలై 15వ తేదీ వరకు సమయం ఉంది. సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాం. ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

- పృథ్వీసాగర్, ఏఓ, బెళుగుప్ప

న్యూస్ బాక్స్

20లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

గుంతకల్లుటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకం లబ్ధికోసం ఈనెల 20లోపు రైతులు ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లీలా వసుంధర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇంకా 291 మంది రైతులు ఈకే వైసీ చేసుకోవాల్సి ఉందన్నారు.

● పుట్లూరు : మండలంలో 140 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని, రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని, లేనిపక్షంలో అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని మండల వ్యవసాయాధికారి కాత్యాయిని తెలిపారు.

● తాడిపత్రి: మండలంలోని రైతులు ఈనెల 20లోపు ఈకేవైసీ చేయించుకోవలని వ్యవసాయాధికారి ఆంజనేయులు తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంతో పాటు కడప రోడ్డులో ఉన్న రైతుసేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదుకు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

తాడిపత్రి యువకుడికి అవార్డు

అనంతపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తాడిపత్రికి చెందిన యశ్వంత్ చిన్న వయసులోనే 10 వేలకు పైగా ఈవెంట్స్ నిర్వహించినందుకు యువ పారిశ్రామికవేత్త అవార్డు వరించింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలో ఓక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యశ్వంత్‌కు సీనియర్ పారిశ్రామికవేత్తలు ఆకాష్ జైపూర్యా, సునీల్ బన్‌స్వాల్ ఈ అవార్డు అందజేశారు.

అదే నిర్లక్ష్యం


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

శెట్టూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పట్ల మండల అధికారులు అదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి 15 మందికి గాను కేవలం ఐదుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు.

వికసిత్ భారత్ సంకల్ప సభ

ఉరవకొండ,జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరశైవ కల్యాణమండపంలో వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, జిల్లా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, ధనుంజయాచారి, ఎం.హరి, సిద్ధప్ప, బీజే వైఎం నాయకులు రమేష్ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : స్థానిక హఠకేశ్వర దేవాలయంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో కాపు రామచంద్రారెడ్డి, కొనకొండ్ల రాజేష్, సంధిరెడ్డి శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవర్గ నిర్వాహకులు సోమ నీలకంఠ, డాక్టర్ యశ్వంత్‌రాజు, రిటైర్డ్ డీఈ రామాంజినేయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కళ్యాణదుర్గం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 21 మంది బాధితులకు సీఎం సహాయ నిధి కింద రూ. 15 లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఆయా బాధితులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్థానిక ప్రజావేదిక వద్ద సోమవారం అందజేశారు.

తహసీల్దార్‌గా రజాక్‌వలి



గుమ్మఘట్ట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా రజాక్‌వలి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై పెద్దవడగూరుకు వెళ్లగా.. తాడిపత్రిలో పనిచేస్తున్న రజాక్‌వలి బదిలీపై ఇక్కడి వచ్చారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా మధుసూదనరావు



బెళుగుప్ప : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా మధుసూదనరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురం డీఎస్‌వో కార్యాలయం నుంచి ఈయన ఇక్కడికి వచ్చారు. గతంలో డీటీగా ఉన్న హుస్సేన్ పీరా ఉద్యోగ విరమణ పొందారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణమూర్తి

ఉరవకొండ,జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ మమత కుందుర్పి జూనియర్ కళాశాలకు బదిలీ కాగా.. ఆమె స్థానంలో ఆయన కుందుర్పి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కమిటీ ఏర్పాటు

ఉరవకొండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక కల్యాణమండపంలో ఆ కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా వాసుదేవుడు, కార్యదర్శిగా విరుపాక్షి, సహాయ కార్యదర్శిగా డీ. రమేష్, కోశాధికారిగా బీరే శేఖర్, గౌరవాధ్యక్షులుగా వీ. శ్రీనివాసులు, పల్లా మురహరి బాబు, పరమేష్, మరో 10 మందిని డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు.

● ఉరవకొండ: ఉరవకొండ నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో నూతన కమిటీని సోమవారం జిల్లా కార్యదర్శి ప్రతాప్‌నారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా ఓబులేశు, కార్యదర్శిగా నారాయణస్వామి, కోశాధికారిగా గోవిందప్పను ఎన్నుకున్నారు. అనంతరం డిపో మేనేజరు హంపన్నను వారు మర్యాదపూర్వకంగా కలిశారు.

20న రెవెన్యూ దినోత్సవం

బొమ్మనహాళ్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏటా జూన్20న నిర్వహించే రెవెన్యూ దినోత్సవంలో భాగంగా రెవెన్యూ శాఖ అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తహసీల్దార్ మునివేలు సోమవారం తెలిపారు. రెవెన్యూ రికార్డులు, అడంగల్ 1బి, ప్రభుత్వ, దేవాదాయశాఖ, వక్ఫ్ భూములు వివరాలు సంబంధిత విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

మండలంలో మోస్తరు వర్షం

బెళుగుప్ప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్ పంటలు వేరుశనగ, కంది విత్తన సాగు చేస్తామని ఎర్రనేల భూముల రైతులు అభిప్రాయపడ్డారు.

రేషన్ దుకాణం తనిఖీ

యాడికి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక గరిడివీధిలో ఉన్న రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లైస్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీచేశారు. రేషన్ సరుకుల పంపిణీపై డీలర్‌ను, పలువురు లబ్ధిదారులను ఆరాతీశారు. తూకాల్లో తేడాలు లేకుండా పంపిణీ చేయాలని, తేడాలు వచ్చినా లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత రేషన్ డీలర్‌పై తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట యాడికి సివిల్ సప్లై అధికారి మల్లేష్, వీఆర్వోలు దామోదర్ నాయుడు, రంగస్వామి, శ్రావణ్ ఉన్నారు.


సరుకుల పంపిణీపై ఆరాతీస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు

కేసీఎల్ విజేత కణేకల్లు ఆర్డీటీ జట్టు


విజేత కణేకల్లు జట్టుతో విప్ కాలవ

రాయదుర్గం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ సారథ్యంలో నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఎల్-2 క్రికెట్ లీగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో రాయదుర్గం ఫ్రెండ్స్ 11 జట్టుపై కణేకల్లు ఆర్డీటీ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఎన్‌టీఆర్ ట్రోఫీతో పాటు రూ. లక్ష, రాయదుర్గం ఫ్రెండ్స్ 11 జట్టు రూ. 50 వేలను ఆర్డీటీ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అందజేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గంలో ఓ స్టేడియం నిర్మించాలని సంకల్పం ఉందన్నారు. టోర్నీని విజయవంతంగా చేపట్టిన నిర్వాహకులను అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

ముగిసిన అమిలినేని క్రికెట్ టోర్నీ

శెట్టూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లులో నెలరోజులుగా మార్కెట్‌యార్డు డైరెక్టర్ కుబేర్ యాదవ్ నిర్వహిస్తున్న అమిలినేని సురేంద్రబాబు మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఫైనల్స్‌లో తిప్పులగాన్ జట్టుపై రామ్ లెవెన్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.50 వేలు నగదు, రన్నరప్ తిప్పు లగాన్ జట్టుకు రూ.30 వేలు, ట్రోఫీలు అందజేశారు. ఇందులో టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

కరెంట్ లేక రోగుల పాట్లు


డయాలసిస్ కోసం వేచి ఉన్న బాధితులు

గుంతకల్లు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ లేదు. ఈ ఆసుపత్రికి జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి ఆ ఆసుపత్రికి వచ్చిన డయాలిసిస్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరితో పాటు ఎక్స్‌రే, రక్తపరీక్షలు కోసం రోగులు నిరీక్షించారు. ఉక్కపోతతో బాలింతలు, నవజాత శిశువులు, చికిత్స పొందుతున్న వృద్ధులు, మహిళలు అల్లాడిపోయారు. క్యాజువాలిటీలో మాత్రం ఇన్వర్టర్ సౌకర్యం ఉంది. మిగిలిన వార్డులకు ఇన్వర్టర్ సౌకర్యం లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. రోగులు ఆసుపత్రి బయటకు వెళ్లి.. చెట్ల కింద కూర్చున్నారు. ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు ఆసుపత్రి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని రోగులు, ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. పది రోజుల్లో ఆస్పత్రిలో జనరేటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

'తల్లికి వందనం' కోసం క్యూ


కూడేరులో మినీ బ్యాంక్ వద్ద క్యూకట్టిన మహిళలు

కూడేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో భాగంగా విద్యార్థుల తల్లులు అకౌంట్‌లోకి నగదు జమ చేసింది. రెండు రోజులు బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దీంతో సోమవారం ఆ డబ్బులను డ్రా చేసుకోవడానికి బ్యాంకులు, మినీ బ్యాంక్‌ల వద్ద తల్లులు క్యూ కట్టారు. కూడేరులో మినీ బ్యాంకు వద్ద తల్లులు ఇలా బారులు తీరారు.

ఆందోళన వద్దు

బెళుగుప్ప, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో 4,394 మందికి తల్లికి వందనం పథకం వర్తించిందని, కొందరికి ఇంకా నగదు జమ కాకపోవడంతో తల్లిదండ్రులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఎంఈవో-2 హరికృష్ణ సోమవారం అన్నారు. అర్హుల జాబితాలో విద్యార్థుల పేరు ఉంటే.. తల్లికి వందనం నగదు బ్యాంకులో జమ అవుతుందని, ఇందులో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

దారితప్పిన కూటమి పాలన

గుంతకల్లుటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలన దారి తప్పిందని సీపీఎం నాయకులు విమర్శించారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను స్థానిక హంపిరెడ్డి భవనంలో సోమవారం విడుదల చేసిన వారు మాట్లాడారు. ప్రతి మహిళలకు రూ.15,000 ఇవ్వాలని, ప్రజలపై విద్యుత్ భారాన్ని తొలగించాలని, హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు ఆపాలని, పిల్ల కాలువలు ఏర్పాటు చేయాలని, ఉపాధి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

సంక్షేమ పథకాలు వర్తింపజేయండి

గుత్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తమకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. ఇంజనీరింగ్ విభాగం కార్మికులు అతి తక్కువ జీతాలతో జీవనం కొనసాగిస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు అమలు చేస్తున్న జీఓ నెంబర్ 36, ఇంజనీరింగ్ కార్మికులకూ వర్తింప జేసి రూ.24 వేలు జీతం చెల్లించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రామాంజినేయులు, సూర్యనారాయణ, మురళీ, ఈశ్వరయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం

బొమ్మనహాళ్/బ్రహ్మసముద్రం/గుత్తి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బొమ్మన హాళ్ మండలంలోని ఉద్దేహాళ్, బండూరు గ్రామాల వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారి అధ్వానంగా తయారైంది. అలాగే బ్రహ్మసముద్రం మండలంలోని కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి ప్రధాన రహదారి సంవత్సరాల తరబడి మరమ్మతులకు నోచుకోక మోకాళ్లలోతు గుంతలు పడ్డాయి. అలాగే గుత్తి పట్టణం నుంచి గుంతకల్లుకు వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. గాంధీ చౌక్ సమీపంలో రోడ్డు మరీ అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వాన వచ్చినా ఆ రోడ్లపై గుంతల్లో నీరు నిల్వ ఉండి.. ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.


గుత్తిలోని గాంధీచౌక్ సమీపంలో రోడ్డు దుస్థితి


గుంతలమయమైన కన్నేపల్లి రోడ్డు


ఉద్దేహాళ్-బండూరు రోడ్డులో నిల్వ ఉన్న వర్షపు నీరు

క్రైం న్యూస్..

వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామంలో లక్ష్మీస్వామి (45) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జుంజురంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీస్వామి 20 సంవత్సరాల క్రితం రాయంపల్లి గ్రామానికి చెందిన కామాక్షిని వివాహం చేసుకున్నాడు. మూడు నెలల నుంచి రాయంపల్లి గ్రామంలోనే భార్య పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. సోమవారం లక్ష్మీస్వామి తోటలోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. లక్ష్మీస్వామికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుంతకల్లుటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మస్తానయ్య దర్గా వద్ద నివాసముంటున్న వడ్డె జంబులింగ భార్య వడ్డె పద్మావతమ్మ సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జంబులింగ, అతని సోదరులు మస్తానయ్య, గిరిరాజ్ మూడు ఇళ్లు ఉన్నాయి. సోదరులు, వీరి తల్లి మారెక్క జంబులింగకు తెలీకుండా ఇంటి పత్రాలను బ్యాంక్‌లో పెట్టి రూ. 17 లక్షలు రుణం తీసుకున్నారు. రుణం చెల్లించాలంటూ బ్యాంక్ నుంచి నోటీస్ రావడంతో విషయం జంబులింగ, ఆయన భార్య పద్మావతమ్మకు తెల్సింది. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఎలా బతకాలని, తమను మోసం చేశారని మనస్థాపం చెందిన పద్మావతమ్మ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉపాధి కూలీ మృతి


మల్లేష్ (ఫైల్)

బ్రహ్మసముద్రం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన హరిజన మల్లేష్ (42) ఉపాధి పనులు చేస్తూ మరణించాడు. సోమవారం ఉదయం అతను ఉపాధి పనులు చేస్తుండగా ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తోటి కూలీలు అతన్ని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. మల్లేష్‌కు భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు లేకుండాపోయిందని, ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లైన్‌మన్‌కు గాయాలు

బెళుగుప్ప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని కాంట్రాక్ట్ లైన్‌మన్ నారాయణస్వామి సోమవారం విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. తోట వద్ద లైన్ మరమ్మతులు చేస్తుండగా స్పార్క్ కావడంతో కిందపడ్డాడు. గాయపడ్డ అతను అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దాడి కేసులో ఏడుగురి అరెస్ట్

గుంతకల్లుటౌన్,జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లో నివాసముంటున్న హిజ్రా లాస్య ఇంటిపై దాడి చేసి, ముగ్గురు హిజ్రాలను తీసుకెళ్లిన సంఘటనలో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ సోమవారం తెలిపారు. రామిరెడ్డి కాలనీ రైల్వే ట్రాక్ వద్ద ఆదివారం వీరిని అదుపులో తీసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

వెలుగులోకి విద్యుత్ సిబ్బంది అక్రమాలు

కణేకల్లు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీలో ఫిల్టర్‌వాటర్ పాయింట్‌కు డమ్మీ మీటర్ ఏర్పాటు చేసి.. అక్రమాలకు పాల్పడిన విద్యుత్‌శాఖ సిబ్బందిపై విజిలెన్స్ ఏఈ మహబూబ్‌పీరా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ ఉద్యోగులు కొందరి నుంచి డబ్బులు వసూలు చేసి డమ్మీ మీటర్లు అమర్చి వారికి తక్కువ బిల్లులు వచ్చేలా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఏఈ కణేకల్లులో సోమవారం తనిఖీలు చేపట్టారు. సాధారణంగా నెలకు ఫిల్టర్‌పాయింట్‌కు సుమారు రూ. మూడు వేలు బిల్ రావాల్సి ఉండగా.. స్థానిక ఇందిరమ్మకాలనీలోని ఓ ఫిల్టర్‌వాటర్ పాయింట్‌కు కేవలం రూ.900 మాత్రమే బిల్ వస్తుండటంతో దాన్ని తనిఖీ చేశారు. డమ్మీ మీటర్ బిగించడంతో తక్కువ బిల్ వస్తున్నట్లు గుర్తించాడు. స్థానిక లైన్‌మన్ పరశురాంతో పాటు సంబంధిత ఉద్యోగులపై ఏఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణకు అనంతపురానికి రావాలని ఆదేశించారు.

కలెక్టర్‌కు 461 అర్జీలు ..


సమస్యలు వింటున్న కలెక్టర్

యాడికి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. 461 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. బదిలీ అయిన జిల్లా అధికారులు, ఇతర అధికారులు వెంటనే వారి స్థానాలకు వెళ్లి జాయిన్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. యాడికిలో వైసీపీ నాయకులు గ్రావెల్ దందాపై చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు, యాడికిలో హౌసింగ్ కాంట్రాక్టర్ లబ్ధిదారులతో డబ్బులు కట్టించుకొని పనులు చేయలేదు, డబ్బులు వెనక్కి ఇవ్వలేదని పలువురు లబ్ధిదారులు, తనకు భూమి కేటాయించాలని గతంలో కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినా స్థానిక అధికారులు పట్టించుకోలేదని రత్నకుమారి అనే మహిళ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డయాలసిస్ పేషెంట్లకు సీడీఎస్ బ్యాగులు ఇవ్వడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని యాడికి చెందిన నవీన్ అనే బాలుడు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశాడు. రైతుల అభ్యర్థన మేరకు యాడికి కాలువను కలెక్టర్ పరిశీలించారు. యాడికి కాలువకు అనుసంధాన పరుస్తూ ఉన్న చెక్‌డ్యాంలకు నీళ్లు అందేలా గేట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. యాడికిలో ఆగిపోయిన హాస్పిటల్ భవనాన్ని పరిశీలించారు.

గొర్రెలకు డీ వార్మింగ్ మందు

బ్రహ్మసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెలకు డీవార్మింగ్ మందును వేసినట్లు పశువైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం గోవిందయ్య దొడ్డి, చెలిమేపల్లి, బొమ్మగానిపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

50 మంది రక్తదానం

యాడికి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. వారికి అనంతపురం డీఆర్ఓ మలోల ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో తాడిపత్రి సేవా బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ పెనుగొండ శివకుమార్, నిర్వాహకులు అశోక్, విజయ్‌కుమార్, బండారు బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఆర్ఓ